# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 14-5-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:218 పేజీలు:6 వెల: రూ.1/-


## ఉప్పల్‌లో విషాదం.. ఓట్ వేయడానికి వచ్చిన మహిళ హార్ట్ ఎటాక్ తో మృతి

హైదరాబాద్ మే 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: నగరంలోని ఉప్పల్ లో విషాదం నెలకొంది. ఓట్ వేయడానికి వచ్చిన ఓ మహిళ హార్ట్ ఎటాక్ తో మృతి చెందింది. భరత్ నగర్ కి చెందిన విజయ లక్ష్మి అనే మహిళ.. ఓటు వేయడానికి పోలింగ్ బూత్ కు వచ్చి క్యూ లైన్ లోనే ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో వెంటనే పోలింగ్ సిబ్బంది.. మహిళను స్థానిక హాస్పిటల్ కి తరలించారు. హార్ట్ ఎటాక్ తో మృతి చెందిందని డాక్టర్ నిర్ధారించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేయనున్నట్లు ఉప్పల్ పోలీసులు తెలిపారు

### చురక

మాటేసి నోటు ఎంత
మాయను చేసిందో
ఓటుకు తన శక్తినంత
ఓర్పుతోని రాసిందో.

ఐతేనేమి జనం తమ
అరిగోసను మరిచేరా
ఆకర్షణ భ్రమలు వాళ్ల
అంతగనం మురిచేరా



-వేల్పుల నారాయణ

## రాష్ట్రంలో ముగిసిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్



హైదరాబాద్, మే 13 :రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు ప్రశాంతంగా కొనసాగింది. పలు పోలింగ్ కేంద్రాల్లో 6 గంటలలోపు నిల్చున్న ఓటర్లకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల అధికారులు అవకాశం కల్పిస్తున్నారు. 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో సాయంత్రం 5 గంటల వరకు 61.16 శాతం పోలింగ్ నమోదైంది. 65 శాతం దాకా పోలింగ్ నమోదయ్యే అవకాశం ఉంది. ఇక సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికకు కూడా పోలింగ్ ప్రక్రియ ముగిసింది.

తెలంగాణలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిసింది. సాయంత్రం 4 గంటలకు క్యూలైన్లలో నిల్చున్న వారందరికీ ఓటేసేందుకు అధికారులు అవకాశం కల్పిస్తున్నారు. మిగిలిన 106 అసెంబ్లీ సెగ్మెంట్లలో సాయంత్రం 6 గంటలకు పోలింగ్ కొనసాగనుంది.

మహబూబాబాద్, పెద్దపల్లి, ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని సమస్యాత్మకమైన 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమై.. సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. సిర్పూర్, ఆసిఫాబాద్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, మంథని, భూపాలపల్లి, ములుగు, పినపాక, ఇల్లెందు, భద్రాచలం, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో పోలింగ్ ప్రక్రియ ముగిసింది.

## ఇండియా కూటమి అధికారంలోకి వస్తుంది : సీఎం రేవంత్

### -336 సీట్లలో పోటీ చేస్తే.. 400 సీట్లు ఎట్లా సాధ్యం?
### -దేశంలో మోదీ వ్యతిరేక వేవ్ నడుస్తోంది
### -ముస్లిం రిజర్వేషన్ల రద్దుపై ఏపీలో కూటమి ఎందుకు చెప్పడం లేదు
### -కొడంగల్ లో మీడియాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, మే 13 :ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖాయమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొడంగల్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ? అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు 33.5 శాతం ఓట్లు వచ్చాయి.. ఈ ఎన్నికల్లో అంతకు మించి వస్తాయన్నారు. బీజేపీ కూడా ఈ ఎన్నికలు మోదీ పాలనకు రెఫరెండం అని చెబుతోందన్నారు. సెప్టెంబర్ 17, 2025తో మోదీ 75 ఏళ్లు నిండుతాయి. ఏజ్ లిమిట్ అమలు చేస్తే ఎవరు ప్రధాని అనేది బీజేపీ తేల్చుకోవాలన్నారు.

దేశంలో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. మ్యాజిక్ ఫిగర్ రాకపోతే బీజేపీ, ఎన్డీఏకు దేశంలో మద్దతు ఇవ్వడానికి ఎవరూ సిద్ధంగా లేరన్నారు. బీజేపీ 336 సీట్లలో మాత్రమే పోటీ చేస్తోంది.. 400 సీట్లు ఎట్లా సాధ్యం? అని ప్రశ్నించారు. 13 ఏళ్లు సీఎంగా, 10ఏళ్లు పీఎంగా పని చేసిన మోదీ.. మన రాజ్యాంగాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేదన్నారు. దేశంలో మతపరమైన రిజర్వేషన్లు లేవు. సామాజికంగా వెనుకబడిన వారికి మాత్రమే దేశంలో రిజర్వేషన్లు అమలులో ఉన్నాయన్నారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తామని ఏపీలో ఎన్డీఏ కూటమి ఎందుకు చెప్పడంలేదని ప్రశ్నించారు. దేశ ప్రజలకు మోదీ మాయమాటలు చెబుతున్నారన్నారు.

ఇండియా కూటమి పేరుతో మేం ప్రజలను ఓట్లు అడుగుతోంటే? మోదీ పేరుతో బీజేపీ ఓట్లు అడుగుతోందన్నారు. ఎవరు నామ్ దార్.. ఎవరు కామ్ దార్ దీన్ని బట్టి తెలుస్తోందన్నారు. ఎవరు అట్టడుగు వర్గాల ప్రజల కోసం పని చేస్తున్నారో చర్చకు సిద్ధమన్నారు. దేశంలో మోదీ వ్యతిరేక వేవ్ నడుస్తోందన్నారు. మోదీ రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడినా చర్యలు లేవన్నారు. నవనీత్ కౌర్ 15సెకన్ల కామెంట్స్ పై చర్యలు లేవన్నారు. బీజేపీ నేతలపై ఎంహెచ్‌ఏ కంప్లైంట్ చేయదన్నారు. కానీ ఒక వీడియో వైరల్ కేసులో తమపై ఎంహెచ్‌ఏ రంగంలోకి దిగిందన్నారు. ఏజెన్సీలను బీజేపీ దుర్వినియోగం చేస్తుందనడానికి ఇది నిదర్శనమన్నారు. బీజేపీ వాషింగ్ మెషిన్ లో చేరగానే కొందరు నాయకుల అవినీతి మరకలు తొలగిపోయాయా? అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ కు ఆదాని, అంబానీ డబ్బులు ఇస్తున్నారన్న మోదీని ఒక్కటే అడుగుతున్నా.. ఈడీ, సీబీఐ, ఐటీ అధికారులను పంపి ఆదానీ, అంబానీల ఆఫీసులపై, ఇళ్లల్లో సోదాలు నిర్వహించండన్నారు. మోదీ ఆరోపణలు నిజమైతే ఎందుకు వారిపై చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. పంద్రాగస్టులోగా రైతు రుణమాఫీ చేసి తీరుతామన్నారు. రుణమాఫీ ఏమీ అసాధ్యమైన టాస్క్ కాదని రేవంత్ రెడ్డి అన్నారు.

లోక్ సభ ఎన్నికలు తమ వంద రోజుల పాలనకు రెఫరెండమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను దెబ్బతీసి పెట్టుబడులు గుజరాత్ కు తరలించుకుపోవాలని బీజేపీ కుట్ర చేస్తోందన్నారు. యూపీ పరిస్థితిని తెలంగాణలో తీసుకురావాలని ప్రయత్నిస్తోందన్నారు. కేసీఆర్ పై తనకు సానుభూతి ఉందన్నారు. మానసిక ఒత్తిడితో, నిరాశతో భావోద్వేగంతో ఆయన ప్రకటనలు చేస్తున్నారన్నారు. కేసీఆర్ కూడా కేఏ పాల్ లాగే మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి అన్నారు.

## వంద శాతం ప్రధాని రేసులో ఉంటాను.. కేసీఆర్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, మే 13 :అవకాశం వస్తే వంద శాతం ప్రధాని రేసులో ఉంటాను అని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. వచ్చే సెషన్‌లో కేసీఆర్ ప్రళయ గర్జన చూస్తరు అని కేసీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విలేకరులు అడిగిన ప్రశ్నలకు కేసీఆర్ సమాధానం ఇచ్చారు.

వచ్చే అసెంబ్లీలో కేసీఆర్ ప్రళయ గర్జన చూస్తారు. డెఫినెట్‌గా చూస్తరు. అవకాశం వస్తే వంద శాతం ప్రధాని రేసులో ఉంటాను. అవకాశం వస్తే ఎవరైనా ఉండరా.. నేను అంత అమాయకుడినా.. అవకాశం రావాల్నే కానీ.. తప్పకుండా రేసులో ఉంటాను. పార్లమెంటరీ పార్టీ లీడర్ సురేశ్ కాబోతున్నారు. చైర్మన్‌కు నేను రేపు లెటర్ ఇష్యూ చేస్తున్నాను. సురేశ్ ఈజ్ మెయిన్ ప్లేయర్ ఇన్ ఢిల్లీ అని కేసీఆర్ పేర్కొన్నారు.

### మా పార్టీలోకే కాంగ్రెసోళ్లు రాబోతున్నారు..

ఒక రోజు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ నీ దొడ్లే ఎంత మంది ఉంటారో చూడు అని అన్నారు. ఏం కాలేదు. ఇది కూడా అంతే ఉంది. ఈయననే బీజేపీలోకి జంపు కొడుతురాని కాంగ్రెస్ పార్టీలో అనుమానాలు ఉన్నాయి. ఓటుకు నోటు కేసులో ఆయన తప్పించుకోలేరు. కాబట్టి కిందమీద అయితే



కేసులు తప్పించుకునేందుకు బీజేపీలోకి వెళ్తాడని అనుకుంటున్నారు. మా పార్టీలోకే కాంగ్రెసోళ్లు రాబోతున్నారు. నన్ను ఎవరూ డైరెక్ట్ అడగలేదు. మా పార్టీలో ఉన్న ముఖ్యులను కాంగ్రెస్ పార్టీలో ఉన్న ముఖ్యులు కన్సల్ట్ అవుతున్నారు. 26 నుంచి 33 మంది ఎమ్మెల్యేలం రెడీగా ఉన్నాం. ఇద్దరం కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేద్దాం అని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. ఏం జరగబోతదో చూద్దాం అని కేసీఆర్ అన్నారు.

### బీఆర్ఎస్ బీఆర్ఎస్‌గానే ఉంటది..

బీఆర్ఎస్ బీఆర్ఎస్‌గానే ఉంటది. పెద్దపల్లితో పాటు మిగతా ఎస్సీ నియోజకవర్గాల్లో మాదిగ సామాజిక ఆగ్రహంగా ఉన్నారు. పెద్దపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించి చూపెడుతామన్నారు. ఆ ఆగ్రహానికి కాంగ్రెస్ బలి అవుతది. జిల్లాలు తీసేస్తామంటే యుద్ధానికి సిద్ధమని ప్రజలు అంటున్నారు. ఇది కూడా కాంగ్రెస్‌కు ఎఫెక్ట్ అవుతోంది అని కేసీఆర్ పేర్కొన్నారు.

### నేటి కందం- నేటికీ అందం

తిరిగెడి కాలపు చక్రము
మురిపెపు మేషమును దాటి- పూదారులలో
తరగని సుధలిడ-రాగా
జరుపంగా వలయు వృషభ సంక్రమణంబున్

(14-5-24 వృషభ సంక్రమణం)



-రాధశ్రీ
సెల్:9494481210

## గడ్చిరోలి జిల్లాలో ఎదురు కాల్పులలో ఇద్దరు మహిళలతోసహా ముగ్గురు నక్సలైట్లు

గడ్చిరోలి మే 13 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);గడ్చిరోలి జిల్లాలో సోమవారం భద్రతా దళాల ఎదురుకాల్పులలో ఇద్దరు మహిళలతోసహా ముగ్గురు నక్సలైట్లు మరణించారని పోలీసులు తెలిపారు. భ్రమాగడ్ తాలూకాలోని కట్రంగట్ట గ్రామ సమీపంలోని అడవిలో నక్సలైట్లు మకాం పెట్టారని నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో భద్రతా దళాలు అక్కడకు చేరుకున్నాయని జిల్లా ఎస్పి నీలోత్పల్ తెలిపారు. గడ్చిరోలి పోలీసులకు చెందిన సి 60 కమాండోలకు చెందిన రెండు యూనిట్లు వెంటనే ఆ ప్రాంతంలో గాలింపు చేపట్టాయని ఆయన చెప్పారు. నక్సలైట్లు కాల్పులు ప్రారంభించడంతో సి 60 సిబ్బంది ఎదురుకాల్పులు జరిపారని యన చెప్పారు. కాల్పులు ఆగిన అంతరం ఆ ప్రాంతంలో గాలింపు జరపగా ఇద్దరు మహిళా నక్సలైట్లతోసహా మూడు మృతదేహాలు లభించాయని ఆయన తెలిపారు. వారిలో ఒకరిని పెరిమిలి దళం కమాండర్, ఇన్‌చార్జ్ వాసుగా గుర్తించినట్లు ఎస్‌పి చెప్పారు. ఒక ఎకె 47 రైఫిల్, ఒక కార్బైన్, ఒక ఎన్సాస్ రైఫిల్, నక్సల్ సాహిత్యం, కొన్ని వస్తువులను ఘటనా స్థలంలో స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. ఆ ప్రాంతంలో నక్సల్స్ కోసం గాలింపు కొనసాగుతోందని ఆయన తెలిపారు.

## దేశవ్యాప్తంగా సాయంత్రం 5 గంటల వరకూ 62.31 శాతం పోలింగ్

### -పశ్చిమబెంగాల్‌లో అత్యధికంగా 75.66 శాతం, జమ్మూకశ్మీర్‌లో అత్యల్పంగా 35.75 శాతం
### -ఏపీలో 68.04, తెలంగాణలో 61.16

న్యూఢిల్లీ మే 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: లోక్‌సభ ఎన్నికల నాలుగో విడత పోలింగ్ 9 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలోని 96 నియోజకవర్గాల్లో చురుకుగా కొనసాగుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకూ 62.31 శాతం పోలింగ్ నమోదైంది. ఈసీఐ విడుదల చేసిన వివరాల ప్రకారం, పశ్చిమబెంగాల్‌లో అత్యధికంగా 75.66 శాతం పోలింగ్ నమోదుకాగా, జమ్మూకశ్మీర్‌లో అత్యల్పంగా 35.75 శాతం నమోదైంది. ఆంధ్రప్రదేశ్‌లో 68.04 శాతం పోలింగ్ నమోదు కాగా, తెలంగాణలో 61.16 శాతం, బీహార్‌లో 54.14, జార్ఖండ్‌లో 63.14, మధ్యప్రదేశ్‌లో 68.01, మహారాష్ట్రలో 52.49, ఒడిశాలో 62.96, ఉత్తరప్రదేశ్‌లో 56.35 శాతం పోలింగ్ నమోదైంది. కాగా, ఆంధ్రప్రదేశ్‌లోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సాయంత్రం 5 గంటల వరకూ 67.99 శాతం, ఒడిశాలోని 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 62.96 శాతం పోలింగ్ నమోదైంది.

## పోలింగ్ వేళ అపశృతి.. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగి గుండెపోటుతో మృతి

భద్రాద్రి కొత్తగూడెం మే 13 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలింగ్ వేళ అపశృతి చోటు చేసుకుంది. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగి గుండెపోటుతో మృతి చెందాడు. అశ్వరావుపేట నెహ్రూ నగర్‌లో ఈ విషాద ఘటన చోటు చేసుకుంది. నెహ్రూ నగర్ 165 పోలింగ్ బూత్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీ కృష్ణ అనే ఉద్యోగికి ఉదయాన్నే అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది.గమనించిన తోటి సిబ్బంది ఆయన్ని ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందాడు. మృతుడు కొత్తగూడెం జిల్లా చుంచుపల్లిలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. శ్రీ కృష్ణ మృతితో స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు









హైదరాబాద్ మే 13 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: రాష్ట్ర వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కొనసాగుతున్నది. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహా పలువురు ప్రముఖులు ఉదయాన్నే కుటుంబ సభ్యులతో కలిసి ఓటువేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఓబుల్‌రెడ్డి స్కూల్‌లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాడు తన సతీమణితో కలిసి ఓటుహక్కు వినియోగించుకున్నారు. త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి సలీంనగర్‌లోని పోలింగ్ కేంద్రంలో కుటుంబ సమేతంగా ఓటువేశారు. కాచిగూడలోని దీక్ష మోడల్ స్కూల్‌లో కుటుంబ సభ్యులతో కలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఓటువేశారు. ఇక పులివెంబులు బాకరాపురంలో ఏపీ సీఎం జగన్, గుంటూరు జిల్లా ఉండవల్లిలో సతీమణి భువనేశ్వరితో కలిసి చంద్రబాబు ఓటు ఎ ా క ు క వినియోగించుకున్నారు. కరీంనగర్‌లోని ఓల్డ్ హైస్కూల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్, అలంపూర్‌లో నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, పాలకుర్తిలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మహబూబ్‌నగర్‌లో శ్రీనివాస్ గౌడ్, వనపర్తిలో నిరంజన్‌రెడ్డి, సూర్యాపేటలో జగదీశ్ రెడ్డి, మెదక్‌లో మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తన స్వగ్రామమైన గోమారంలో ఓటుహక్కు వినియోగించుకున్నారు.

# సమస్యల చట్రంలో నలుగుతున్న పట్టణ బాల్యం !

మురికి వాడలు, వీధులు, వలసలు, అంగవైకల్య వర్గాలకు చెందిన పట్టణ బాలలు దయనీయ స్థితుల్లో కాలం గడుపుతున్నట్లు పలు నివేదికలు స్పష్టం చేయడం ప్రభుత్వాల పని తీరును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఇదే విషయాలను 'నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్' నివేదిక ప్రకారం పట్టణ పేద పసిపిల్లల బతుకులు కడు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, నిరు పేద నగర చిన్నారుల హక్కులకు విఘాతం కలుగుతున్నదని పేర్కొనడం గమనిస్తున్నాం. దేశంలోని 18 ఏండ్ల లోపు పిల్లలు 47.2 కోట్లు ఉండగా అందులో 12.9 కోట్ల బాలలు (34 శాతం) నగరాల్లో నివసిస్తున్నారని తెలుస్తున్నది. అసంబద్ధ పట్టణీకరణ జరుగుతుండడంతో బాలల బతుకులు పెనం లోంచి పొయ్యిలో పడ్డట్లు అవుతున్నది. పోషకాహార లోపం, పరిసరాల అపరిశుభ్రత, బాలల హక్కులు పరిహాసం పాలు కావడం ఆదుకునే నాథులు లేక మాదక ద్రవ్యాల బారిన సహితం పడడం గమనిస్తున్నాం. నగర ఐదేళ్ళ లోపు బాలల్లో 32 శాతం వరకు తక్కువ బరువుతో(అండర్ వేయిట్), 39.6 శాతం ఎత్తు తగ్గడం (స్టంటెడ్), 21.5 శాతం నవజాత శిశువులు తక్కువ బరువుతో పుట్టడం గమనించారు.

నగర బాల్యం నరక సమానం:

పట్టణాలు కాంక్రీట్ జంగల్స్ కావడం, గ్రీన్ స్పేస్‌లు కొరవడడం, గేటెడ్ కమ్యూనిటీల్లో ఖాళీ స్థలాలు తగ్గడం లాంటి కారణాలతో అన్ని వర్గాల బాలలు ఇండ్లకు మాత్రమే పరిమితం అవుతూ స్థూలకాయం, సామాజిక నైపుణ్యాల కొరత, పట్టణ కాలుష్య భూతం లాంటి సంక్షోభాల బారిన పడుతున్న చిన్నారుల బతుకులు ఛిద్రం కావడం గమనిస్తున్నాం. మురికి కాలువతో సహజీవనం, వీధులే తమ ఇండ్లు కావడం, వలసల బతుకులు అమానవీయంగా మారడం గమనిస్తున్నాం. నగరాల్లో ఆట స్థలాల కొరత, రోడ్లు కాలుష్య కూపాలుగా మారడం, రోడ్డు ప్రమాదాలు తరుచుగా జరగడం, అనుమతులు లేని వాహనాలు నడపడం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, పేద నుస్సహాయ తల్లితండ్రులకు ఎరవేసి పసి కూనలను అక్రమరవాణా విష వలయంలో బంధించడం లాంటి సందర్భాల్లో నగర పిల్లలు ప్రమాదాల గుప్పిట్లో పడుతున్నారు, ప్రాణాలను సహితం కోల్పోతున్నారు. దుర్భర దారిద్ర్యంలో మగ్గిపోతున్న తల్లితండ్రులకు గాలమేస్తున్న నేరగాళ్లు పిల్లల్ని చెరపట్టి వెట్టిచాకిరి ఊబీలోకి నెట్టడం నగరాల్లో సర్వసాధారణం అయ్యింది.

అక్రమ రవాణా విషవలయంలో అభాగ్య బాలలు:

పుండు మీద కారం చల్లినట్లుగా పాఠశాలల్లో వసతుల కొరత, ఉపాధ్యాయుల అభ్యంతరకర ప్రవర్తనలు, బాలలపై నేరాలు/హింసలు దినదినం పెరగడం గమనిస్తున్నాం. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో -2022 ప్రకారం 2021తో పోల్చితే 2022లో 8.7 శాతం పిల్లలపై నేరాలు పెరిగాయని, 7.5 శాతం తప్పిపోయిన పిల్లల సంఖ్య పెరిగిందనే కఠిన వాస్తవాలు పౌర సమాజాన్ని నివ్వెరపరుస్తున్నాయి.

ఇటీవల విడుదలైన నివేదిక ప్రకారం దాదాపు 47,000లకు పైగా పిల్లల ఆచూకీ తెలియడం లేదని, వీరిలో అధికులు అక్రమ రవాణా శృంఖలంలో చిక్కి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

ఉద్యోగాల పేరిట అమ్మాయిలకా వల వేసి పడుపు వృత్తిలోకి బలవంతంగా దింపుతున్న కర్కశ మూకల కూసాలు విరగ్గొట్టాలని పౌర సమాజం కోరుతున్నది. మన బాలలకు అందించే మధ్యాహ్న భోజన పథకాల్లో పోషకాహార లభ్యత పై అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ విద్యా వ్యవస్థలు విఫలం కావడంతో ఉన్నత విద్య, ఉద్యోగాలకు యువత బారులు తీరడం చూస్తున్నాం. స్వేచ్ఛగా ఆలోచించడానికి సమయం ఇవ్వడం లేదు. వెట్టిచాకిరీ కోరల్లో చిక్కిన పసికూనలను గుర్తించి బడి బాట పట్టించడానికి ప్రభుకడత్వాలు పూనుకోవాలి.

కోటా కోచింగ్ కారాగారాలు:

కోటా సంస్థల కోచింగ్ కారాగారాల్లో పిల్లల్ని బలవంతంగా చేర్పించడం, బాల్యాన్ని కాటు వేయడం, మార్కులు/ర్యాంకుల వేటలో బాలల సంపూర్ణ వ్యక్తిత్వ వికాస ఎదుగుదలకు తూట్లు పొడవడం లాంటివని మన పిల్లల వైఫల్యాలకు కారణం అవుతున్నాయి. పట్టణ బాలలు అనారోగ్యం, శిశు మరణాలు, పాఠశాల/ఆట స్థలాల సదుపాయాల కొరత, అక్రమ రవాణా, లైంగిక హింస, బాల కార్మికులు, గృహాల్లో పనులు చేయడం, వీధుల వెంట గడపడం, మాదక ద్రవ్యాల బారిన పడడం, ఇటుక బట్టీల్లో మగ్గడం, హోటళ్లలో పని చేయడం, గాజులు/టపాసుల తయారీల్లో బాల్యం గడిచి పోవడం లాంటి పలు సమస్యలకు ప్రభుత్వాలు సత్వర పరిష్కారాలను చూపించి రేపటి భారత భాగ్య విధాతలను తయారు చేద్దాం.

కాసుల కక్కుర్తితో బంగారు బాల్యాన్ని చిదిమేస్తున్న కీచకులను క్షమించడం కూడా నేరమే. నేటి పట్టణ బాలభారతం రేపటి ఉజ్వల యువ భారతంగా ఎదగాలని కోరుకుందాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# పిఠాపురంలో ఎర్ర కండువా రగడ- ఓటర్‌తో వంగా గీత వాగ్వాదం

### -కండువా తీసిన తర్వాతే ఓటింగ్ కు అనుమతి
### -ఎర్రకండువా అంటే అంత భయమెందుకన్న నాగబాబు



పిఠాపురం, మే 13 : ఏపీలో ఇవాళ సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. అందరి దృష్టి కాకినాడ జిల్లా పిఠాపురం అసెంబ్లీ స్థానంపై కేంద్రీకృతమై ఉంది. ఇక్కడ జనసేన నుంచి పవన్ కల్యాణ్, వైసీపీ నుంచి వంగా గీత బరిలో ఉన్నారు. కాగా, ఓ పోలింగ్ కేంద్రం వద్ద పరిశీలనకు వచ్చిన వంగా గీత ఓ వ్యక్తిపై మండిపడ్డారు. అతడు మెడలో ఎర్ర కండువా వేసుకుని రావడమే అందుకు కారణం. అయితే, అతడు జనసేనకు మద్దతుగా ఆ ఎర్ర కండువా వేసుకొచ్చాడంటూ ఆమె తీవ్ర అభ్యంతరం చెప్పారు.

అయితే, ఇది కాశీ రుమాలంటూ ఆ వ్యక్తి సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వంగా గీతతో పాటు, అక్కడి ఎన్నికల సిబ్బంది కూడా అంగీకరించలేదు. అతడిని అక్కడ్నించి వెళ్లిపోవాలని స్పష్టం చేశారు. దీనిపై జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు స్పందించారు.

ఎర్ర తువ్వాలును కాశీ తువ్వాలు అంటారని వెల్లడించారు. ఆ తువ్వాలను కష్టం చేసుకునే ప్రతి కార్మికుడు ధరించవచ్చని తెలిపారు. ఆ తువ్వాలును వేసుకునే హక్కు ఏ పౌరుడికైనా ఉంటుందని" నాగబాబు స్పష్టం చేశారు. ఆ తువ్వాలును అడ్డుకోవడం అనేది చట్ట వ్యతిరేకం అవుతుంది ఆ తర్వాత మీ ఇష్టం" అంటూ వంగా గీతకు కౌంటర్ ఇచ్చారు.

# ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ దంపతులు



మెదక్, మే 13 : ఓటర్లు అందరూ తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి : జిల్లా కలెక్టర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం పోలింగ్ డే సందర్భంగా మెదక్ జిల్లా హవేలీ ఘన్పూర్ మండల్ ఔరంగాబాద్ ప్రాథమిక పాఠశాల 211 పోలింగ్ కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ సతీ సమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఈ సందర్భంగా ప్రజలకు తన సందేశాన్ని తెలియజేస్తూ ఓటు హక్కు మాత్రమే కాదని బాధ్యతగా ప్రతి ఓటరు వినియోగించుకోవాలని కోరారు. పార్లమెంట్ కాన్స్టెన్సీ పరిధిలో పోలింగ్ ప్రశాంతమైన వాతావరణంలో జరుగుతుందని ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పగడ్బందీగా చర్యలు చేపట్టామని తెలిపారు.

ఈరోజు సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని 6 గంటల వరకు పోలింగ్ కేంద్రం లోపలి ఉన్నవారికి టోకెన్లు అందించడం జరుగుతుందని వారు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు అని వివరించారు.




శ్రీలేఖ సాహితి, వరంగల్

ఆహ్వానము

చెన్నమనేని రంగనాయకమ్మ స్మారక విశిష్టాద్వైత జాతీయ సాహిత్య పురస్కారం

12-05-2024 సాయంత్రం 5.00 గంటలకు
గౌ॥ శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు గారి గృహములో
జూబ్లీ హిల్స్, హైదరాబాద్

ముఖ్య అతిథి
"పద్మవిభూషణ్" గౌ॥ శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు
మాజీ ఉపరాష్ట్రపతి, భారత ప్రభుత్వం

సభాధ్యక్షులు
డా॥ రేవూరి అనంత పద్మనాభరావు

సత్కారములు
శ్రీమతి శ్రీదేవి మురళీధర్
హైదరాబాద్
డా॥ వైష్ణవ వేంకటరమణమూర్తి
నంద్యాల
శ్రీ గార రంగనాథం
రాజాం, విజయనగరం జిల్లా

పుస్తకావిష్కరణలు
శ్రీభాష్యము – కరదీపిక
వేదాంత దేశికులు – హంస సందేశము


# సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాలు విడుదల

### – అబ్బాయిల కన్నా అమ్మాయిలే ఎక్కువ సంఖ్యలో ఉత్తీర్ణత

న్యూఢిల్లీ మే 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాలు ఇవాళ రిలీజ్ అయ్యాయి. ఆ పరీక్షల్లో అబ్బాయిల కన్నా అమ్మాయిలే ఎక్కువ సంఖ్యలో పాసయ్యారు. సీబీఎస్ఈ 12వ తరగతిలో 87.98 శాతం మంది విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. గత ఏడాది 87.33 శాతం మంది పాసయ్యారు. ఈ ఏడాది 91.52 శాతం మంది అమ్మాయిలు పరీక్షలను క్లియర్ చేశారు. బాయ్స్ పర్సంటేజీ కన్నా అమ్మాయిలు 6.40 పర్సంటేజీ అదనంగా పాసయ్యారు. సుమారు 24 వేల మంది విద్యార్తులు ఈ పరీక్షల్లో 95 శాతం కన్నా ఎక్కువ మార్కులను సంపాదించారు. ఇక లక్షా 16 వేల మంది విద్యార్థులు 90 శాతం మార్కులను సాధించారు. కంపార్ట్‌మెంట్ లో 1.22 లక్షల మంది విద్యార్థులు ఉన్నట్లు ప్రకటనలో వెల్లడించారు. ఈసారి 16.21 లక్షల మంది విద్యార్థులు సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షలు రాశారు.

# హింసాత్మక ఘటనలపట్ల చంద్రబాబు తీవ్ర ఆందోళన వ్యక్తం

### – మాచర్లలో దాడులు జరగడం పోలీసుల వైఫల్యమే..

అమరావతి మే 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఏపీలో పలు ప్రాంతాల్లో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పల్నాడు జిల్లాతో పాటు పలు చోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్న చంద్రబాబు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మాచర్లలో ఇప్పటికీ దాడులు జరగడం పోలీసుల వైఫల్యమేనని మండిపడ్డారు. పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించడంలో పోలీసులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలింగ్ బూత్ ల వద్ద నెలకొంటున్న పరిస్థితులపై ఎప్పటికప్పుడు ఫిర్యాదులు చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసులు విఫలమయ్యారని.. వెంటనే ఎన్నికల సంఘం పోలింగ్‌ను సమీక్షించి పరిస్థితిని చక్కదిద్దాలని చంద్రబాబా డిమాండ్ చేశారు.

# సంగారెడ్డిలో ఓటు వేసిన గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్

సంగారెడ్డి, మే 13 :తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ తెలిపారు. సంగారెడ్డి పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో కుటుంబ సభ్యులతో కలిసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.




# జాతీయ సాంకేతిక దినోత్సవం-2024ను జరుపుకున్న టెక్నాలజీ డెవలప్‌మెంట్ బోర్డ్ (టిడిబి)-సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం

న్యూఢిల్లీ, మే 13డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలోని టెక్నాలజీ డెవలప్‌మెంట్ బోర్డ్ (టిడిబి) మే 11న న్యూఢిల్లీలోని ఐటిఓలోగల ఐఎన్ఎస్ఏ ఆడిటోరియంలో జాతీయ సాంకేతిక దినోత్సవం, 2024ని జరుపుకుంది.

'సుస్థిర భవిష్యత్తు కోసం క్లీన్ అండ్ గ్రీన్ టెక్నాలజీలను ప్రోత్సహించడం' అనే అంశంపై జరిగిన ఈ కార్యక్రమం..ప్రముఖ శాస్త్రవేత్తలు, విశ్లేషకులు, క్లీన్ అండ్ గ్రీన్ మరియు మరింత స్థితిస్థాపక దిశగా దేశం ప్రయాణించేందుకు ఒక మార్గాన్ని రూపొందించాలనే లక్ష్యంతో జరిగింది.

ప్రభుత్వ ప్రధాన సాంకేతిక సలహాదారు ప్రొఫెసర్ అజయ్ కుమార్ సూద్ మాట్లాడుతూ గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను తగ్గించే లక్ష్యంతో నేషనల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ మిషన్ ప్లాన్ (ఎన్ఈఎంఎంపి) మరియు హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వెహికల్స్ (ఎఫ్ఏఎంఈ) వేగవంతమైన అడాప్షన్ మరియు తయారీ వంటి కార్యక్రమాల ద్వారా ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీలు) ప్రవేశాన్ను భారతదేశం చేపట్టిందన్నారు. ప్రధానమంత్రి సైన్స్, టెక్నాలజీ ఇన్నోవేషన్ మరియు అడ్వైజరీ కౌన్సిల్ (పిఎం-ఎస్‌టిఐఏసి) నేతృత్వంలోని ఈవీ మిషన్‌ను, ఈవీ స్వీకరణ కోసం సహాయక ప్రమాణాలు మరియు ఫ్రేమ్‌వర్క్‌లను అభివృద్ధి చేయడానికి అంకితం చేయబడిందని వివరించారు.

2070 నాటికి నికర-సున్నా లక్ష్యం వైపు భారతదేశ ప్రయాణంలో జాతీయ హైడ్రోజన్ మిషన్ యొక్క వ్యూహాత్మక ప్రాముఖ్యతను ప్రొఫెసర్ సూద్ వివరించారు. ఈ మిషన్‌లో కీలకమైన అంశంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో గణనీయమైన పెట్టుబడులని తెలిపారు. కార్బన్ క్యాప్చర్ యుటిలైజేషన్ అండ్ స్టోరేజ్ (సిసియుఎస్) సాంకేతికతలలో కొనసాగుతున్న ప్రయత్నాలను కూడా ప్రొ. సూద్ హైలైట్ చేశారు. సుస్థిర అభివృద్ధి మరియు అంతర్జాతీయ వాతావరణ లక్ష్యాలను చేరుకోవడం కోసం భారతదేశ సాంకేతిక ఫ్రేమ్‌వర్క్‌లు మరియు విధానాలను పెంపొందించడంలో జీరో ఎమిషన్ ట్రక్కింగ్‌పై రాకీ మౌంటైన్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్ఎంఐ)తో ఓపిఎన్ఏ భాగస్వామ్యం వంటి సంప్రదింపుల సమూహాలు మరియు అంతర్జాతీయ సహకారాల ప్రాముఖ్యతను కూడా ప్రొ.సూద్ హైలైట్ చేశారు.

డీఎస్టీ సెక్రటరీ ప్రొఫెసర్ అభయ్ కరాండికర్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి ఆవిష్కరణల ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. ఆవిష్కరణల సంస్కృతిని పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. వ్యక్తులు దేశ ప్రగతికి దోహదపడే అవకాశాలను అందించారు. స్టార్టప్‌లను ఇంక్యుబేట్ చేయడం మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను పెంపొందించడం లక్ష్యంగా నిధి మరియు టిడిబి వంటి పథకాల ద్వారా వివిధ పరిశోధన మరియు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూర్చడంలో మరియు ఆవిష్కరణలను పెంపొందించడంలో ప్రభుత్వ చొరవలను ఆయన హైలైట్ చేశారు. ప్రొ. కరాండికర్ తన ప్రసంగంలో స్థిరమైన రంగాలలో ముఖ్యంగా నీటి శుద్ధి మరియు ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీలు) వంటి క్లీన్ అండ్ గ్రీన్ టెక్నాలజీలలో పరిశోధన మరియు అభివృద్ధికి మద్దతు ఇవ్వడంలో డిఎస్టీ యొక్క కీలక పాత్రను నొక్కిచెప్పారు. ఈ కార్యక్రమాలలో చేసిన గణనీయమైన పెట్టుబడులను ఆయన గుర్తించారు మరియు క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ రంగంలో స్టార్టప్‌లు మరియు ఎంఎస్ఎంఈలకు మద్దతు ఇవ్వడంలో టిడిబి మార్గదర్శక ప్రయత్నాలను హైలైట్ చేశారు.

సాంకేతిక మంత్రిత్వ శాఖలతో సహకారాన్ని మరియు సుస్థిరత లక్ష్యాల వైపు వారి పరివర్తనను ప్రొ. కరాండికర్ హైలైట్ చేస్తూ పురోగతిని నడపడానికి పాలసీ ఫ్రేమ్‌వర్క్‌లలో సాంకేతికతను సమగ్రపరచడం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. 2070 నాటికి నికరసున్నా కర్బన ఉద్గారాలను సాధించాలనే దృక్పథంతో సుస్థిరత ప్రయత్నాలలో భారతదేశం ప్రపంచ అగ్రగామిగా ఎదగాలని ప్రొ.కరాండికర్ ఆకాంక్షించారు.

పద్మశ్రీ ప్రొఫెసర్. జి.డి. యాదవ్ చేసిన ముఖ్య ఉపన్యాసం 2070 నాటికి కార్బన్ నికర సున్నాని సాధించడానికి స్థిరమైన పరిష్కారాలు, కార్బన్ తొలగింపు మరియు సాంకేతిక ఆవిష్కరణలను ప్రోత్సహించడంపై కొనసాగింది. వైట్ హైడ్రోజన్ సంభావ్యతను మరియు గ్రీన్ హైడ్రోజన్ భవిష్యత్తు వాగ్దానాన్ని ఆయన హైలైట్ చేశారు. వ్యర్థాల నుండి సంపద కర్మాగారాలు, హైడ్రోజనేటింగ్ ప్లాస్టిక్ మరియు బ్యాటరీ రీసైక్లింగ్‌ను స్థిరమైన ఆవిష్కరణలకు మార్గాలుగా ప్రతిపాదించడాన్ని వివరించారు.

టిడిబి కార్యదర్శి శ్రీ.రాజేష్ కుమార్ పాఠక్ మాట్లాడుతూ టిడిబి ద్వారా నిధులు సమకూరుస్తున్న కీలకమైన ప్రాజెక్ట్‌లను హైలైట్ చేశారు. పర్యావరణ సారథ్యాన్ని పెంపొందించడంలో ఈ సాంకేతికతల కీలక పాత్రను వివరించారు.

ఐఎన్ఎస్ఏ ప్రెసిడెంట్ మరియు డిఎస్టీ మాజీ సెక్రటరీప్రొఫెసర్ అశుతోష్ శర్మ మాట్లాడుతూ సుస్థిరత లక్ష్యాలను సాధించడంలో సాంకేతికత యొక్క కీలక పాత్రను హైలైట్ చేశారు. విధాన నిర్ణేతలు మరియు వాటాదారులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. "సాంకేతికత రెండు వైపులా పదును గల కత్తి: ఇది అసమర్థతను తగ్గిస్తుంది, కానీ వినియోగాన్ని పెంచగలదు. దీనిని ఎదుర్కోవడానికి, ఈవీలు, గ్రీన్ హైడ్రోజన్, కార్బన్ క్యాప్చర్ మరియు ఇంధన-సమర్థవంతమైన ఆవాసాలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా పునరుత్పాదక శక్తికి మారడం చాలా అవసరమని..వాతావరణ మార్పు సాంకేతికత సుస్థిరతకు ఉపయోగపడుతుందని నిర్ధారిద్దామని పిలుపునిచ్చారు.

ప్రతిష్టాత్మకమైన రెజెనెరాన్ ఇంటర్నేషనల్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఫెయిర్ (ఐఎస్ఈఎఫ్)లో పోటీ చేసేందుకు ఎంపికైన 20 ప్రాజెక్ట్‌లకు ప్రాతినిధ్యం వహిస్తున్న 23 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 100 వినూత్న ప్రాజెక్ట్‌లను ప్రదర్శించిన 140 మంది విద్యార్థులలో ఈ ఫైనలిస్టులు యూఎస్ఏలోని లాస్ ఏంజెల్స్, కాలిఫోర్నియాలో మే 11-17, 2024 నుండి రెజెనెరాన్ ఐఎస్ఈఎఫ్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడానికి గౌరవనీయమైన స్థానాన్ని పొందారు. రెజెనెరాన్ ఐఎస్ఈఎఫ్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రీ-కాలేజ్ సైన్స్ ఫెయిర్‌గా ప్రసిద్ధి చెందింది. 60కు పైగా దేశాల నుండి 1,600 మంది యువ సైన్స్ ఔత్సాహికులను ఇది ఏకం చేసింది. ఆలోచనల మార్పిడిని ప్రోత్సహిస్తుంది మరియు అత్యాధునిక విజ్ఞాన శాస్త్రాన్ని ప్రదర్శిస్తుంది. "ఒలింపిక్స్ ఆఫ్ సైన్స్ ఫెయిర్స్"గా పిలువబడే ఈ కార్యక్రమం ప్రపంచ వేదికపై ప్రకాశింపజేయడానికి యువతకు ఒక వేదికగా ఉపయోగపడుతుంది.

# అడవులపై ఏర్పాటైన ఐక్యరాజ్యసమితి వేదిక 19వ సమావేశంలో అటవీ సంరక్షణ, సుస్థిర అటవీ నిర్వహణ కార్యక్రమాలను ప్రముఖంగా ప్రస్తావించిన భారతదేశం

న్యూఢిల్లీ, మే 13న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో 2024 మే 6 నుంచి 10 వరకు జరిగిన యునైటెడ్ నేషన్స్ ఫోరమ్ ఆన్ ఫారెస్ట్ (యుఎన్ఎఫ్ఎఫ్) 19వ సమావేశంలో భారతదేశం పాల్గొంది. ఈ సమావేశంలో అటవీ సంరక్షణ, స్థిరమైన అటవీ నిర్వహణలో భారతదేశం సాధించిన గణనీయమైన పురోగతిని భారత ప్రతినిధి బృందం వివరించింది. భారతదేశం అమలు చేస్తున్న విధానాల వల్ల గత పదిహేనేళ్లలో అటవీ విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా 2010- 2020ల మధ్య నమోదైన సగటు వార్షిక అటవీ ప్రాంతం విస్తరణలో భారతదేశం మూడవ స్థానంలో ఉంది.

జీవ వైవిధ్యం,వన్యప్రాణుల సంరక్షణకు భారతదేశం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. సంరక్షణ చర్యల్లో భాగంగా దేశవ్యాప్తంగా వెయ్యికి పైగా వన్యప్రాణుల అభయారణ్యాలు, జాతీయ ఉద్యానవనాలు, టైగర్ రిజర్వ్‌లు, బయోస్పియర్ రిజర్వ్‌లు, ఇతర వన్యప్రాణుల ఆవాసాలు అభివృద్ధి చెందాయి.

ఇటీవల భారతదేశంలో అమలు జరుగుతున్న ప్రాజెక్ట్ టైగర్‌కి 50 సంవత్సరాలు , ప్రాజెక్ట్ ఎలిఫెంట్‌కు 30 సంవత్సరాలు పూర్తి అయ్యాయి.

ఈ సందర్భంగా దేశంలో విస్తృత స్థాయిలో కార్యక్రమాలు అమలు చేసిన భారతదేశం వన్య జాతుల పరిరక్షణ, నివాస పరిరక్షణకు ఇస్తున్న ప్రాధాన్యతను వెల్లడించింది. పెద్ద పిల్లి జాతికి చెందిన పులి, సింహం, చిరుత, మంచు చిరుత వంటి ఏడు పెద్ద పిల్లి జాతులను రక్షణ, సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్ ను సమావేశంలో భారతదేశం ప్రముఖంగా ప్రస్తావించింది.

పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను మరింత పటిష్టం చేయడానికి చెట్ల పెంపకం , క్షీణించిన అటవీ భూముల పునరుద్ధరణ కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు రూపొందించిన 'గ్రీన్ క్రెడిట్ ప్రోగ్రామ్' వివరాలను భారత ప్రతినిధి బృందం వివరించింది.

గతంలో 2023 అక్టోబర్ లో భారతదేశం డెహ్రాడూన్‌లో యునైటెడ్ నేషన్స్ ఫోరమ్ ఆన్ ఫారెస్ట్ సహకారంతో నిర్వహించిన సమావేశంలో 40 దేశాలు, 20 అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో అటవీ అగ్ని ప్రమాదాల నిర్వహణ , అటవీ ధృవీకరణపై చర్చలు జరిపారు. ఈ సమావేశం సిఫార్సులను యుఎన్ఎఫ్ఎఫ్ 19 వ సమావేశానికి భారతదేశం సమర్పించింది.

యుఎన్ఎఫ్ఎఫ్ 19 వ సమావేశంలో భాగంగా భూసార పరిరక్షణ కోసం అడవుల్లో సంభవించే అగ్ని ప్రమాదాల నిర్వహణలో అంతర్జాతీయ సహకారం అనే అంశంపై మంత్రిత్వ శాఖ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. పోర్చుగల్, కొరియా అటవీ సేవలు, ఇంటర్నేషనల్ ట్రాపికల్ టింబర్ ఆర్గనైజేషన్ (ఐటిటిఓ) ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ ఫైర్ మేనేజ్‌మెంట్ సహకారంపై మంత్రిత్వ శాఖ సమావేశాన్ని నిర్వహించింది.

అటవీ నిర్మూలన, అడవులు నశించి పోకుండా చూడడానికి అడవుల కోసం ఐక్యరాజ్య సమితి రూపొందించిన వ్యూహాత్మక ప్రణాళికను అమలు చేయడానికి తక్షణ చర్యలు అమలు చేయాలని సూచిస్తూ యునైటెడ్ నేషన్స్ ఫోరమ్ ఆన్ ఫారెస్ట్ 10వ సమావేశం తీర్మానాన్ని ఆమోదించింది.

ప్రపంచ అటవీ లక్ష్యాల సాధన సహా భూమి క్షీణతను నివారించడానికి అత్యవసర, వేగవంతమైన చర్యలు అమలు జరగాలని సమావేశంలో తీర్మానం ఆమోదించారు.

భారత ప్రతినిధి బృందానికి డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ , భారత ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీ జితేంద్ర కుమార్ నాయకత్వం వహించారు.

# టాంజానియాలో అధికారిక పర్యటనకు బయలుదేరిన డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ డిఎస్ రాణా

న్యూఢిల్లీ, మే 13డైరెక్టర్ జనరల్ డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (డీజీ డిఐఏ) లెఫ్టినెంట్ జనరల్ డిఎస్ రాణా యునైటెడ్ రిపబ్లిక్ ఆఫ్ టాంజానియాకు అధికారిక పర్యటనకు వెళ్లారు. 13-15 మే 2024 వరకు ఈ పర్యటన చేయనున్నారు. రెండు దేశాల మధ్య దృఢమైన రక్షణ సంబంధాలను మరింత బలోపేతం చేయడం, ప్రాంతీయ భద్రతా సహకారం కోసం అవకాశాలను చర్చించడం ఈ పర్యటన ఉద్దేశం.

తన పర్యటనలో, డీజీ డిఐఏ టాంజానియా పీపుల్స్ డిఫెన్స్ ఫోర్స్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ జాకబ్ జాన్ కుండా, అక్కడి డిఫెన్స్ ఇంటిలిజెన్స్ మేజర్ జనరల్ ఎంఎన్ కెరేమి మొదలైన టాంజానియా సీనియర్ సైనిక నాయకత్వంతో సమావేశాలు ఉంటాయి. టాంజానియా నేషనల్ డిఫెన్స్ కాలేజీకి పర్యటనలో, టిపిడిఎఫ్ భవిష్యత్తు నాయకులతో భారతదేశ భద్రతా దృక్పథం గురించి చర్చిస్తారు. ఈ సమావేశాలు పరస్పర అవగాహన పెంపొందించుకోవడం, ద్వైపాక్షిక రక్షణ సహకారాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా ఉంటాయి.

లెఫ్టినెంట్ జనరల్ డిఎస్ రాణా భారత హైకమిషన్ దార్ ఎస్ సలామ్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన డిఫెన్స్ వింగ్‌ను కూడా ప్రారంభిస్తారు. సైనిక సహకారాన్ని విస్తరింపజేయడానికి సుహృద్భావ సూచనగా, టిపిడిఎఫ్ కి భారతదేశంలో తయారు చేసిన బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లను అందజేస్తారు. కమాండ్ అండ్ స్టాఫ్ కాలేజ్ సిఎస్సి అరుష వద్ద డీజీ డిఐఏ లైబ్రరీని ప్రారంభిస్తారు. భారత ప్రభుత్వ సహాయం ద్వారా ఏర్పాటు చేయనున్న వ్యాయామశాలకు శంకుస్థాపన చేస్తారు.

భారతదేశం టాంజానియాతో సన్నిహిత, సహృద్భావ, స్నేహపూర్వక సంబంధాలను పంచుకుంటుంది, ఇది బలమైన సామర్థ్యం పెంపుదల, రక్షణ సహకారానికి మార్గాల ద్వారా బలోపేతం చేయబడింది. భారత సైనిక ప్రతినిధి బృందం పర్యటన టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు.

# ఫస్ట్ ట్రైనింగ్ స్క్వాడ్రన్ (1 టిఎస్ )లో 106 ఇంటిగ్రేటెడ్ ఆఫీసర్ ట్రైనీస్ కోర్స్ సిబ్బందికి సముద్రంలో శిక్షణ

న్యూఢిల్లీ, మే 13సముద్రంలో కఠిన శిక్షణ పూర్తి చేసుకున్న 106 ఇంటిగ్రేటెడ్ ఆఫీసర్ ట్రైనీస్ కోర్స్ (ఐఓటిసి) సిబ్బందికి వీడ్కోలు కార్యక్రమం జరిగింది 2024 మే 9న జరిగిన ఈ కార్యక్రమానికి సదరన్ నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్

ఇన్ చీఫ్ వీఏడీఎం వీ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విదేశాలకు చెందిన వారితో సహా 99 మంది సముద్రంలో 1 టిఎస్ లో విజయవంతంగా శిక్షణ పూర్తి చేశారు. శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించిన వారిని సదరన్ నేవల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ వీఏడీఎం వీ శ్రీనివాస్ అభినందించి ప్రతిభ చూపిన వారికి అవార్డులు అందజేశారు.

శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మిడ్‌షిప్‌మ్యాన్ సి ప్రణీత్‌కుటెలిస్కోప్,శిక్షణలో మొదటి స్థానంలో నిలిచిన మిడ్‌షిప్‌మ్యాన్ పిపికె రెడ్డి బైనాక్యులర్‌ను అందుకున్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న వారిని ఉద్దేశించి మాట్లాడిన ముఖ్యఅతిథి సముద్ర వాతావరణాన్ని అర్థం చేసుకుని ఎప్పటికప్పుడు మారుతున్న యుద్ధ తంత్రాలు, వ్యూహాలు, సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకోవడానికి కృషి చేయాలని సూచించారు. వేగం, భద్రత, ధైర్యంతో విధులు నిర్వర్తిస్తూ కింది స్థాయి సిబ్బంది పట్ల వృత్తి నైపుణ్యం,సానుభూతితో పని చేయాలని ఆయన సూచించారు. 'సేవా పరమో ధర్మం' నినాదంతో విధులు నిర్వర్తించాలని ఆయన సూచించారు.

2024 మే 11న ఐఎన్ఎస్ తీర్ లో సంప్రదాయబద్ధంగా శిక్షణ ళిపూర్తి చేసుకున్న అధికారులు నిర్వహించిన విన్యాసాలను సదరన్ నావల్ కమాండ్ సీఎస్ఓ (శిక్షణ) రియర్ అడ్మిరల్ సతీష్ షెనాయ్ సమీక్షించారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులు పశ్చిమ, తూర్పు సముద్ర తీరంలో నౌకాదళ యుద్ధనౌకలు, సముద్రతీరానికి సంబంధించిన సమగ్ర శిక్షణ కోసం కోస్ట్ గార్డ్ పెట్రోలింగ్ నౌకల్లో చేరుతారు. మారిషస్ కోస్ట్ గార్డ్ కి చెందిన అసిస్టెంట్ కమాండెంట్ ప్రిషితా జగ్గమా 1 టిఎస్ లో సముద్ర శిక్షణ పూర్తి చేసిన మొదటి మహిళ గా గుర్తింపు పొందారు.

# కేదార్‌నాథ్ ఆలయానికి పోటెత్తిన భక్తులు.. మూడురోజుల్లోనే 75వేల మందికిపైగా దర్శనం..!

న్యూఢిల్లీ, మే 13ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాల్లో ఒకటైన కేదార్‌నాథ్ ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. ఆలయ ద్వారాలు తెరిచిన నాటి నుంచి ఇప్పటి వరకు 75వేల మందికిపైగా భక్తులు బాబా కేదార్‌ను దర్శించుకున్నారు. వరుసగా మూడురోజుల్లో రోజుకు 20వేల మందికిపైగా భక్తులు తరలివస్తున్నారు. పంచకేదార్‌లోని ప్రధాన క్షేత్రమైన కేదార్‌నాథ్ ధామ్ ద్వారాలను అక్షయ తృతీయ సందర్భంగా ఈ నెల 10న తెరిచిన విషయం తెలిసిందే. ఆలయ ప్రారంభోత్సవం రోజునే రికార్డు స్థాయిలో 29,030 మంది భక్తులు బాబా కేదార్ దర్శనం చేసుకున్నారు. ఆదివారం 23,510 మంది పరమేశ్వరుడిని దర్శించుకున్నారు. బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ భక్తులు దర్శనాలు చేసుకునేలా అన్ని ఏర్పాట్లు చేసింది.

తెల్లవారు జామున 4గంటల నుంచి ఎనిమిది గంటల వరకు భక్తులకు గర్భగుడిలో దర్శనాలు జరుగుతున్నాయి. అయితే, ఆ తర్వాత రద్దీ పెరుగుతుండడంతో దూరం నుంచే దర్శనం కల్పిస్తున్నారు. నగటున గంటకు 1,700 మందికిపైగా భక్తులు దర్శనాలు చేసుకుంటున్నారు. బద్రీనాథ్ కేదార్‌నాథ్ టెంపుల్ కమిటీ తెలిపిన వివరాల ప్రకారం మూడురోజుల్లో 75,139 మంది కేదార్‌నాథ్ ధామ్‌ను సందర్శించారు. గత ఐదేళ్లలో ఇదే రికార్డు. ఈ భక్తుల్లో 49,144 మంది పురుషులు, 25,002 మంది మహిళలు, 991 మంది పిల్లలు ఉన్నారు. ఇద్దరు విదేశీ మహిళలు సైతం బాబా కేదార్‌నాథ్‌ను దర్శించుకున్నారు.

ఆలయంలో ఉదయం 4 గంటల నుంచి దర్శనాలు కల్పిస్తున్నట్లు బీకేటీసీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమేశ్ చంద్ర తివారీ తెలిపారు. స్వామివారికి నైవేద్యం సమర్పించేందుకు మధ్యాహ్నం 3 గంటలకు మూసివేస్తున్నట్లు తెలిపారు. ఆ తర్వాత 4 గంటల నుంచి 6.30 గంటల వరకు దర్శనాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఏడు గంటలకు హారతి కొనసాగుతుందన్నారు. కేదార్‌నాథ్‌లో ప్రత్యేక పూజల కోసం బుకింగ్ చేసుకున్న భక్తులకు రాత్రి 11 గంటల నుంచి పూజలు కొనసాగుతున్నాయని.. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న భక్తుల పేరుతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

# ఓటు హక్కు వినియోగించుకున్న సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్



హైదరాబాద్, మే 13 :సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోంది. మోండా మార్కెట్‌లోని ఇస్లామియా హైస్కూల్‌లో సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. ఓటు మనకు రాజ్యాంగం కల్పించిన హక్కు. దాన్ని వినియోగించుకోవడం మన బాధ్యత. అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పద్మారావు గౌడ్ పిలుపునిచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 24.91 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.




# కాంగ్రెస్‌కు టెంపోలో డబ్బులు పంపి ఉంటే అదానీ, అంబానీని అరెస్ట్ చేయండి: మల్లికార్జున్ ఖర్గే

న్యూఢిల్లీ, మే 13కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి కౌంటర్ ఇచ్చారు. అదానీ, అంబానీల నుంచి కాంగ్రెస్‌కు టెంపోల నిండా డబ్బులు అంది ఉంటాయన్న మోదీ వ్యాఖ్యలను ఆయన తిప్పికొట్టారు. చాలా ధైర్యమైన బీజేపీ ప్రభుత్వం అదానీ, అంబానీలను ఎందుకు అరెస్టు చేయలేదు? అని ప్రశ్నించారు. 'మీరు హేమంత్ సోరెన్‌ను అరెస్ట్ చేశారు. అదానీ, అంబానీలను ఎందుకు అరెస్టు చేయడం లేదు' అని మల్లికార్జున్ ఖర్గే అన్నట్లు పీటీఐ వార్తా సంస్థ పేర్కొంది.

కాగా, ప్రధాని మోదీ ప్రభుత్వం పాలసీలు రూపొందించినప్పుడు అదానీ సహా కొంత మంది పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా వ్యవహరించినట్లు రాహుల్ గాంధీ విమర్శించారు. రైతుల సంక్షేమాన్ని పణంగా పెట్టి పారిశ్రామికవేత్తల రుణాలను కేంద్ర ప్రభుత్వం మాఫీ చేసిందని గతంలో ఆరోపించారు.

మరోవైపు ఇటీవల తెలంగాణాలో ఎన్నికల ప్రచారం సందర్భంగా రాహుల్ గాంధీపై ప్రధాని మోదీ విరుచుకుపడ్డారు. 'కాంగ్రెస్ యువరాజు ఐదేళ్లుగా పదే పదే ఒక విషయం చెబుతున్నారు. రాఫెల్ ఇష్యూ తెరమరుగయ్యాక ఐదుగురు పారిశ్రామిక వేత్తలను, ముఖ్యంగా అంబానీ, అదానీలను లక్ష్యంగా చేసుకున్నారు. అయితే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించగానే వారిపై దాడులు చేయడం మానేశారు. కాంగ్రెస్‌కు టెంపో లోడ్లు (కరెన్సీ) చేరాయా? అని నేను అడగాలనుకుంటున్నా. రాత్రికి రాత్రే అంబానీ, అదానీపై యువరాజు ఆరోపణలు ఆగిపోవడానికి ఏ డీల్ జరిగింది' అని మోదీ ప్రశ్నించారు.

# అందుబాటులోకి సాధికార బౌద్ధ సాహిత్యం

హైదరాబాద్, మే 13 : సుమారు ఇరవై ఏండ్ల కిందట తెలగు భాషలో కల్పిత ఊహా జనిత కథలు తప్ప బౌద్ధం గురించి వాస్తవాలు అందుబాటులో లేవని నేడు సాధికార బౌద్ధ సాహిత్యం తెలుగులో అందుబాటులోకి వచ్చిందని విశ్రాంత పోలీస్ ఉన్నతాధికారి సి.ఆంజనేయ రెడ్డి అన్నారు. ఈ సాహిత్య ప్రచురణలో కెకె రాజా కృషి ప్రశంసనీయమని అభినందించారు.

రవీంద్రభారతి ప్రధాన వేదికపై లతా రాజ ఫౌండేషన్ నిర్వహణలో బౌద్ధ సాహిత్యంపై పది రచనలతో పాటు ఇతర నాలుగు సామాజిక సాహిత్య సంపుటిల అవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో బుద్ధిస్ట్ బుర్ర గోవర్ధన్, ఈమని నాగిరెడ్డి, నటరాజ్ శాఖ రచన నారాయణ గురు, డాక్టర్ బండి సత్యనారాయణ, రచన నిర్వహణ పట్టాభి రామయ్య, ప్రొఫెసర్ సుధారాణి, మధుకర్, డాక్టర్ పద్మాకర్, కేవీ రావు, మల్లేపల్లి లక్ష్మయ్య, ఆంజనేయరెడ్డి, బి.నర్సింగ్ రావు, బొర్ర గోవర్ధన్, వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఓటర్ల పట్ల దురుసుగా ప్రవర్తించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్

## -మీరు బొట్టు కూడా పెట్టుకోవద్దు.. ఎందుకు పెట్టుకున్నారని ప్రశ్న



ఆదిలాబాద్ మే 13 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: భారతీయ జనా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించడవే కాకుండా మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారు.ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో పాటు ఆయన అనుచరులు ఓ పోలింగ్ కేంద్రంలోకి కాషాయు కండువాలు ధరించి ప్రవేశించారు. దీంతో ఓటేసేందుకు వచ్చిన కొంత మంది మహిళలు వారిని అడ్డుకున్నారు.

కాషాయు కండువా ధరించి ఎందుకు వచ్చారని మహిళా ఓటర్లు ప్రశ్నించారు. దీంతో మీరు బొట్టు కూడా పెట్టుకోవద్దు.. ఎందుకు పెట్టుకున్నారని మహిళా ఓటర్ల పట్ల దురుసుగా ప్రవర్తించారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్ కూడా దౌర్జన్యానికి పాల్పడ్డారు. వారిని బయటకు పంపండి అంటూ పోలీసులను ఎమ్మెల్యే ఆదేశించారు. కాషాయ కండువా కప్పుకున్న వారిని బయటకు పంపిస్తేనే తాము బయటకు వెళ్తామని మహిళలు పోలీసులకు తెగేసి చెప్పారు.

# దాడులు, హత్యాయత్నాలతో ఓటమిని జగన్ ఒప్పుకున్నారు- చంద్రబాబు

అమరావతి, మే 13 :ఏపీలో పోలింగ్ కొనసాగుతున్న తీరుపై టీడీపీ అధినేత చంద్రబాబు టిట్టర్ ద్వారా స్పందించారు. ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. వైసీపీ అడ్డంకుల్ని అధిగమించి మరీ ప్రజలు ఓటింగులో పాల్గొనడం అభినందనీయం అన్నారు. మందుటెండలను లెక్కచేయకుండా ప్రజలు ఓటింగ్ లో పాల్గొంటుండడం హర్షణీయమని వెల్లడించారు. ఇక, ఓటమి భయంతో మాచర్ల, రైల్వేకోడూరు, పుంగనూరులో వైసీపీ పేట్రేగిపోయిందని చంద్రబాబు మండిపడ్డారు. "సిరా చుక్క పడాల్సిన చోట రక్తపు చుక్కలు పడేలా చేశారు. క్యూలైన్‌లో రమ్మన్నందుకు తెనాలిలో అన్నాబత్తుని శివకుమార్ దాడి దుర్మార్గం. దాడులు, దౌర్జన్యాలతో ప్రజాభిప్రాయాన్ని మార్చలేరన్నారు.

## వైసీపీ వ్యతిరేకత కనిపించింది..

శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు వైసీపీ వ్యతిరేక పవనాలు స్పష్టంఓటమి ఖాయమని నిర్ధారణ కావడంతో అల్లర్లకు తెగబడుతున్నారు. ఐదేళ్ల దౌర్జన్యకాండను ఎన్నికల వేళ కూడా కొనసాగిస్తున్నారు. దాడులు, హత్యాయత్నాలతో ముందస్తుగానే ఓటమిని ఒప్పుకున్నారు. పుంగనూరు, మాచర్ల, రైల్వేకోడూరు, మైదుకూరు, ఆముదాలవలస, తాడికొండలో కూటమి ఏజెంట్లపై దాడి దుర్మార్గం. తక్కెల్లపాడు పోలింగ్ స్టేషన్లో ఎస్సీ మహిళలపైకి ఎంపీ అభ్యర్థి కిలారు రోశయ్య కారుతో దూసుకు రావడం హేయం. బాధ్యులపై ఎన్నికల కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలి. పోలింగ్ ప్రారంభమైనప్పటికీ జగన్ రెడ్డి పేరుతో ఓటర్లకు ఐవీఆర్ఎస్ కాల్స్ వస్తున్నాయి. యర్రగొండపాలెంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించారు. నరసరావుపేటలో ఎంపీ అభ్యర్థి కృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి వాహనాలపై దాడి చేశారు. తాడిపత్రిలో ఎమ్మెల్యే పెద్దారెడ్డి, ఆయన కుమారుడు ఓటర్లను బెదిరించారు. ఆముదాలవలసలో తమ్మినేని సీతారాం అర్ధాంగి రిగ్గింగ్‌కు పాల్పడ్డారు. పోలింగ్ ప్రక్రియకు అంతరాయం కలిగిస్తున్న వారిపై ఎన్నికల కమిషన్‌లు చర్యలు తీసుకోవాలి" అంటూ చంద్రబాబు పేర్కొన్నారు.

సాయంత్రం 5 కావస్తుంది?.ఉదయం 7 గంటలకు ఎంత పెద్దఎత్తున ఓటర్లు పోలింగ్ స్టేషన్లలో ఉన్నారో?.పోలింగ్ ముగిసే ఈ సమయంలో కూడా అంతే ఉత్సాహంగా ఓట్లు వేస్తున్నారు. ప్రజలు ఓటింగ్ పై ఇంత ఉత్సాహం చూపడం ప్రజాస్వామ్యానికి శుభపరిణామం. ఆ వర్గం ఈ వర్గం అని లేదు?అన్ని వర్గాలు వచ్చి ఓటేస్తున్నారు. ఆ ప్రాంతం ఈ ప్రాంతం అని లేదు?అన్ని ప్రాంతాల్లో అదే జోరు కనిపిస్తోంది. మాచర్ల, నర్సారావుపేట వంటి చోట్ల ఓటమి భయంతో వైసీపీ హింసకు పాల్పడింది. తాడిపత్రిలో ఏకంగా ఎస్పీ వాహనం పైనే వైసీపీ గూండాలు దాడి చేశారు. అదే విధంగా నర్సారావుపేట లోక్ సభ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, అసెంబ్లీ అభ్యర్థి చదలవాడ అరవిందబాబు వాహనాలపై దాడికి పాల్పడ్డారు. మరోవైపు తెనాలిలో వైసీపీ ఎమ్మెల్యే ఓటరుపై చేయి చేసుకున్నారు. ఇంత స్థాయిలో హింస జరిగినా ప్రజలు ఎక్కడా వెనక్కి తగ్గలేదు. ఇంకా పోలింగ్ కేంద్రాలకు వస్తూనే ఉన్నారు వారందరికీ అభినందనలు అని అన్నారు చంద్రబాబు

# మూడు రోజులుగా విద్యుత్ లేకపోవడంతో ఎన్నికలను బహిష్కరించిన గిరిజనులు



కొల్లాపూర్ మే 13 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: రాష్ట్రంలో ఒక్క నిమిషం కూడా కరెంటు కోతలు లేవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు వట్టి కోతలేనని మరోసారి రుజువైంది. ఏకంగా సీఎం సొంత జిల్లాలోని ఓ తండా మూడు రోజులుగా విద్యుత్ లేకపోవడంతో ప్రజలు ఎన్నికలను బహిష్కరించారు.

కరెంటు వచ్చేవరకు ఓటేసేది లేదని ఆందోళనకు దిగారు. దీంతో ఓటర్లు లేకపోవడంతో ఆ ఊర్లోని పోలింగ్ కేంద్రంలో అధికారులు ఖాళీగా ఉండిపోయారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం అమరగిరి చెంచు గూడెంలో మూడు రోజులుగా కరెంటు లేకపోవడంతో గ్రామస్థులు ఓట్లు వేయకుండా ఆందోళనకు దిగారు. గత మూడు రోజుల నుంచి కరెంట్ లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

తాము చెంచులమన్న ఉద్దేశంతోనే ఎవరూ ఇటువైకూడా రాలేదని ఆవేదన వ్యక్తంచేశారు.



# సైనిక వ్యవహారాల్లో సాంకేతికత విప్లవాన్ని నడిపిస్తోంది

## – చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్



న్యూఢిల్లీ, మే 13చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ మాట్లాడుతూ, సాంకేతికత సైనిక వ్యవహారాలలో విప్లవాన్ని నడిపిస్తోం దని, ప్రస్తుత సాంకేతికతల సమ్మేళనం మరియు భవిష్యత్తులో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలలో పెట్టుబడి పెట్టవలసిన అవసరాన్ని నొక్కి చెబుతుంది. మే 11, 2024న జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా అటామిక్ ఎనర్జీ విభాగం శాస్త్రవేత్తలు మరియు ఇంజనీర్ల సమావేశంలో ఆయన ప్రసంగించారు. 'అటామ్స్ ఫర్ సొసైటీ: సెక్యూరింగ్ వాటర్, ఫుడ్ ఒ హెల్త్' అనే అంశంపై రెండు రోజుల థీమ్ ప్రోగ్రామ్‌ను కూడా అఆూ ప్రారంభించింది. ముంబైలోని ఃంఖీఅలో. జనరల్ అనిల్ చౌహాన్ ఈ సంవత్సరం థీమ్, 'సమాజం కోసం పరమాణువులు: నీరు, ఆహారం ఒ ఆరోగ్యాన్ని భద్రపరచడం', మన సమాజం ఎదుర్కొంటున్న అత్యంత ముఖ్యమైన సమస్యలను పరిష్కరిం చడంలో సైన్స్ మరియు టెక్నాలజీ యొక్క కీలక పాత్రను హైలైట్ చేస్తుంది. CDS సైన్స్ అండ్ టెక్నాలజీలో దేశం యొక్క చారిత్రక నైపుణ్యాన్ని పెంపొందించింది, జాతీయ భద్రతకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రహించేందుకు ఊహాత్మక స్ఫూర్తిని పునరుజ్జీవింపజేయడాన్ని ప్రోత్సహిస్తుంది. మన దేశ ప్రగతిని రూపుదిద్దిన సైన్స్ అండ్ టెక్నాలజీలో సాధించిన అద్భుతమైన పురోగతులను ప్రతిబింబించే సమయం ఇది అని, అలాగే మన దేశాన్ని ముందుకు నడిపించేందుకు పట్టుదలతో కృషి చేస్తున్న మన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు మరియు ఆవిష్కర్తల అవిశ్రాంత ప్రయత్నాలను గుర్తించే అవకాశం ఉందని ఆయన అన్నారు.

జనరల్ అనిల్ చౌహాన్ మన దేశం యొక్క అభివృద్ధి కోసం సైన్స్ మరియు టెక్నాలజీని అభివృద్ధి చేయడంలో DAE యొక్క తిరుగులేని నిబద్ధతను అభినందించారు. అతను జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా DAE మరియు దాని సభ్యులకు తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశాడు మరియు భారతదేశం పురోగతి మరియు ఆవిష్కరణల మార్గంలో ముందుకు సాగుతున్నప్పుడు ప్రయత్నాలు కొనసాగాలని ఆకాంక్షించారు.

# మిలిటరీ నర్సింగ్ సర్వీస్ అంతర్జాతీయ నర్సుల దినోత్సవం, 2024ని జరుపుకుంటుంది



న్యూఢిల్లీ, మే 13అంతర్జాతీయ నర్సుల దినోత్సవం 2024 11 మే 2024న ఆయుర్విజ్ఞాన్ ఆడిటోరియం, ఆర్మీ హాస్పిటల్ లో జరుపుకున్నారు. మేజర్ జనరల్ కన్వర్జిత్ సింగ్, ఆఫ్గ కమాండెంట్ ఆర్మీ హాస్పిటల్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మేజర్ జనరల్ షీనా పిడి ప్రిన్సిపాల్ మేట్రాన్ స్వాగతం పలికారు.

సమాజానికి నర్సులు చేసిన సేవలకు గుర్తుగా ప్రతి సంవత్సరం ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఇంటర్నేషనల్ కౌన్సి ల్ ఆఫ్ నర్సు లు ఈ సంవత్సరం థీమ్ ను 'అవర్ నర్సులు అవర్ ఫ్యూచర్, ది ఎకనామిక్ పవర్ ఆఫ్ కేర్'గా ప్రకటించారు మరియు థీమ్‌ను మేజర్ జనరల్ ఎ ఆ ఫ్లోరా, ఆవిష్క రించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని, 'నర్సింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్: బూన్ ఆర్ ఎ బాన్' అనే అంశంపై చర్చ మరియు చర్చాగోష్ఠి నిర్వహించబడింది. ప్రముఖ ప్యానలిస్టులు నర్సింగ్ వృత్తిలో సవాళ్లు, నర్సుల సాధికారత, నర్సుల నాయకత్వ పాత్ర, నర్సింగ్ విద్య, ఆరోగ్య సంరక్షణలో డిజిటలైజేషన్, నర్సు బర్న్ అవుట్ మొదలైన వివిధ అంశాలపై చర్చించారు.

ముఖ్యఅతిథి ప్యానెలిస్టులను సత్కరించి, ప్రతిభ కనబరిచిన నర్సింగ్ అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కెప్టెన్ దీపా షాజన్‌కు పుష్పరంజన్ అవార్డు లభించింది. ముఖ్య అతిథి కూడా ఈ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు మరియు మిలిటరీ నర్సింగ్ అధికారులు నిర్దేశించిన వృత్తిపరమైన ప్రమాణాలు మరియు నైతికతను నిలబెట్టేలా వారిని ప్రోత్సహించారు. రోగులను అత్యంత కరుణ మరియు సానుభూతితో చూసుకుంటూ అంతులేని షిఫ్టులలో అవిశ్రాంతంగా పనిచేస్తున్నందుకు MNS అధికారులను ఆయన అభినందించారు.

# వారి ఓటు వారే వేసుకోలేక పోయారు.. బరిలోకి దిగిన అభ్యర్థులు

హైదరాబాద్ మే 13 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఎవరైనా.. మీ అమూల్యమైన ఓటు హక్కు వినియోగించుకొని తమను గెలిపించాలంటూ ఎన్నికల ప్రచారంలో ఓటర్లను అభ్యర్థిస్తూ ఉంటారు. అందుకు పంచాయతీ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి దిగిన అభ్యర్థులు ఎవరు.. అందుకు మినహాయింపు కాదన్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఓటర్ల వద్దకు వచ్చి తనను గెలిపించండంటూ అభ్యర్థించిన అభ్యర్థులే.. తాము బరిలో దిగిన నియోజకవర్గంలో వారికే ఓటు లేక పోవడం కొసమెరుపు.

అందుకు హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి కొంపెల్ల మాధవి లత, ఎంఐఎం ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఓవైసీ, మల్కాజ్‌గిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి. మే 13వ తేదీన జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో.. వీరు ముగ్గురు బరిలో దిగినా... తమ గెలుపు కోసం వారికి వారు ఓటు వేసుకోక పోవడం గమనార్హం.

కొంపెల్ల మాధవి లత..

హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా ఆమె బరిలో దిగారు. సికంద్రాబాద్ ఈస్ట్ మారెడుపల్లిలోని మహేంద్ర హిల్స్‌లో ఆమె నివసిస్తున్నారు. ఈ ప్రాంతం మల్కాజ్‌గిరి లోక్‌సభ పరిధిలోకి వస్తుంది. దీంతో మాధవి లత తన కోసం.. తన ఓటును వినియోగించుకోలేక పోయారు.

అసదుద్దీన్ ఓవైసీ..

హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. కానీ ఆయన నివాసం రాజేంద్రనగర్ పరిధిలో ఉంది. అంటే ఈ ప్రాంతం చేవెళ్ల లోక్‌సభ పరిధిలోకి వస్తుంది. అదీకాక చేవెళ్లలో ఎంఐఎం తరపున ఎవరు బరిలో నిలవలేదు. దాంతో ఏదో పార్టీకి, ఎవరో ఒకరికి ఆయన ఓటు వేయాల్సి ఉంది. దీంతో అసదుద్దీన్ గెలుపునకు ఆయన సైతం ఓటు వేసుకోలేక పోయారు.

పట్నం సునీతామహేందర్‌రెడ్డి..

మల్కాజ్‌గిరి నుంచి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా ఆమె ఎన్నికల బరిలో నిలిచారు. ఆమె ఓటు తాండూరు పరిధిలో ఉంది. ఈ ప్రాంతం చేవెళ్ల పరిధిలో ఉంది. ఈ నేపథ్యంలో ఆమె సైతం తన ఓటు తనకు కాకుండా.. ఇతరులకు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు రాష్ట్రంలో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు దాదాపుగా అందరు తమ నియోజకవర్గాల్లో తమ విజయం కోసం ఓటు వేసుకుంటున్నారు. కానీ ఈ ముగ్గురు అభ్యర్థులు మాత్రం తమ గెలుపునకు తామే ఓటు వేసుకోనే పరిస్థితి లేకపోవడం సర్వత్ర చర్చనీయాంశంగా మారింది.

# ఇక పెళ్లి చేసుకోక తప్పేలా లేదు..! ఎన్నికల ప్రచారంలో రాహుల్ సరదా వ్యాఖ్యలు..

న్యూఢిల్లీ, మే 13 ఇక పెళ్లి చేసుకోక తప్పేలా లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఉత్తరప్రదేశ్ రాయ్‌బరేలీలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ గాంధీ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి బరిలోకి దిగిన విషయం తెలిసిందే. కేరళ వయనాడ్ ఎంపీ స్థానం మరోసారి పోటీ చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడ ఆయన సిట్టింగ్ ఎంపీ. అలాగే, కాంగ్రెస్ కంచుకోట రాయ్‌బరేలీలో సైతం బరిలోకి దిగారు. కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ మొన్నటి వరకు పోటీ చేస్తూ వచ్చారు. ఆమె స్థానంలో రాహుల్ గాంధీ పోటీలో ఉన్నారు. ఈ క్రమంలో సోమవారం ప్రియాంక గాంధీతో కలిసి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో బీజేపీ, ఎన్డీయే సర్కారు వైఖరిపై ఆయన తీవ్రంగా స్పందించారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఈ సందర్భంగా రాయ్‌బరేలితో కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు.

ఇందిరా గాంధీ, సోనియా గాంధీ ఇక్కడి నుంచే పోటీ చేశారన్న రాహుల్.. ఇది తమకు కర్మభూమి లాంటిదన్నారు. సభలో పాల్గొన్న పలువురు జనం రాహుల్ జీ ఎప్పుడు పెళ్లి చేసుకుంటారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా స్పందిస్తూ.. 'ఇప్పుడు నేను త్వరలో పెళ్లి చేసుకోక తప్పేలా లేదు (అబ్ జల్దీ హి కర్నీ పడేగీ)' అని నవ్వి అభివాదం చేస్తూ ప్రసంగాన్ని ముగించారు. అక్కడే ఉన్న ప్రియాంక గాంధీ సైతం నవ్వుతూ ఉండడం కనిపించింది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# గూడ్స్ అగ్రిమెంట్ జాయింట్ కమిటీలో ఆసియాన్-ఇండియా ట్రేడ్ 4వ సమావేశం



న్యూఢిల్లీ, మే 13 AITIGA (ASEAN-India Trade in Goods Agreement) సమీక్ష కోసం 4వ జాయింట్ కమిటీ సమావేశం మలేషియాలోని పుత్రజయలో 7–9 మే 2024 వరకు జరిగింది మరియు భారత వాణిజ్య శాఖ అదనపు కార్యదర్శి శ్రీ రాజేష్ అగర్వాల్ మరియు సహ అధ్యక్షత వహించారు. శ్రీమతి మస్తురా అహ్మద్ ముస్తఫా, డిప్యూటీ సెక్రటరీ జనరల్ (వాణిజ్యం), పెట్టుబడి, వాణిజ్యం ఒ పరిశ్రమల మంత్రిత్వ శాఖ, మలేషియా. భారతదేశం మరియు మొత్తం 10 ఆసియాన్ దేశాల ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు.

AITIGA యొక్క సమీక్ష కోసం చర్చలు, ప్రాంతం అంతటా వ్యాపారాలకు మరింత సులభతరం చేయడానికి మరియు వ్యాపారాలకు ప్రయోజనకరంగా చేయడానికి, మే 2023లో ప్రారంభమయ్యాయి. సమీక్షా పనిని చేపట్టే జాయింట్ కమిటీ ఇప్పటివరకు నాలుగు సార్లు సమావేశమైంది. జాయింట్ కమిటీ తన మొదటి రెండు సమావేశాలలో సమీక్ష చర్చల కోసం దాని నియమ నిబంధనలను మరియు చర్చల నిర్మాణాన్ని ఖరారు చేసింది మరియు AITIGAo సమీక్ష కోసం చర్చలను 18–19 ఫిబ్రవరి 2024 వరకు న్యూఢిల్లీలో జరిగిన దాని మూడవ సమావేశం నుండి ప్రారంభించింది.

సమీక్షలో ఒప్పందంలోని వివిధ విధాన రంగాలతో వ్యవహరించడానికి మొత్తం 8 సబ్‌కమిటీలు ఏర్పాటు చేయబడ్డాయి మరియు వీటిలో 5 సబ్‌కమిటీలు తమ చర్చలను ప్రారంభించాయి. మొత్తం 5 సబ్-కమిటీలు తమ చర్చల ఫలితాలను 4వ ఒమిఎఉం జాయింట్ కమిటీకి నివేదించాయి. 'నేషనల్ ట్రీట్‌మెంట్ అండ్ మార్కెట్ యాక్సెస్', 'రూల్స్ ఆఫ్ ఒరిజిన్', 'స్టాండర్డ్స్, టెక్నికల్ రెగ్యులేషన్స్ అండ్ కన్ఫర్మిటీ అసెస్‌మెంట్ ప్రొసీజర్స్' మరియు 'లీగల్ అండ్ ఇన్‌స్టిట్యూషనల్ ఇష్యూస్'తో వ్యవహరించే ఈ నాలుగు సబ్-కమిటీలు 4వ AITIGAతో పాటు మలేషియాలోని పుత్రజయంలో భౌతికంగా సమావేశమయ్యాయి. జాయింట్ కమిటీ. శానిటరీ మరియు ఫైటోసానిటరీ సబ్‌కమిటీ ముందుగా 3 మే 2024న సమావేశమైంది. జాయింట్ కమిటీ సబ్‌కమిటీలకు అవసరమైన మార్గదర్శకాలను అందించింది.

భారతదేశపు ప్రపంచ వాణిజ్యంలో 11% వాటాతో భారతదేశపు ప్రధాన వాణిజ్య భాగస్వాములలో యాఇంఔ ఒకటి. 2023–24లో ద్వైపాక్షిక వాణిజ్యం జూఆ 122.67 ఃని వద్ద ఉంది. ఒమిఎఉం యొక్క అప్‌గ్రేడేషన్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత పెంచుతుంది. ఇండోనేషియాలోని జకార్తాలో 29–31 జూలై 2024 వరకు 5వ జాయింట్ కమిటీ సమావేశానికి ఇరుపక్షాలు తదుపరి సమావేశం కానున్నాయి.

# నిర్ణీత సమయానికల్లా క్యూలైన్లో ఉన్న వారందరికీ ఓటు

## –ఏపీ ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా

అమరావతి మే 13 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఏపీలో సార్వత్రిక ఎన్నికల కోసం ఉదయం 7 గంటల నుంచే మొదలైన పోలింగ్ సాయంత్రం 6గంటలకు ముగిసింది. ఏపీలో 175 అసెంబ్లీ, 25 ఎంపీ స్థానాల కోసం ఈ ఎన్నికలు జరిగాయి. పలు నియోజకవర్గాల్లో కీలక నేతల మధ్య గట్టి పోటీ కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో ఏపీ ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా కీలక ప్రకటన చేశారు. సాయంత్రం 6.00 గంటల కల్లా క్యూ లైన్లో ఉన్న వారందరికీ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని చెప్పారు. ఎలాంటి కంగారు లేకుండా ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటింగ్ ప్రక్రియ ముగిసే నిర్ణీత సమయానికల్లా క్యూలైన్లో ఉన్న వారందరికీ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉందని చెప్పారు. ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఈఓ ఎంకే మీనా పేర్కొన్నారు. రంపచోడవరం, పాడేరు, అరకు నియోజకవర్గాల్లో సాయంత్రం 4.00 గంటలకు, పాలకొండ, కురుపాం, సాలూరు నియోజకవర్గాల్లో సాయంత్రం 5.00 గంటలకు ఓటింగ్ ప్రక్రియ ముగిసిందని వివరించారు. ఆ నియోజకవర్గాల్లో క్యూలైన్లో ఉన్న వారందరికీ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. ఇతర నియోజకవర్గాల్లో సాయంత్రం 6.00 గంటలకల్లా క్యూ లైన్లో ఉన్న వారందరికీ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఎలాంటి కంగారు లేకుండా ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఈఓ ఎంకే మీనా పేర్కొన్నారు. ఇదిలావుండగా.. ఈ ఎన్నికల్లో ఏపీ ఓటర్లు ఎంతో చురుకుగా, ఉత్సాహంగా పాల్గొన్నారు. కొన్ని ప్రాంతాల్లో గందరగోళ వాతావరణం నెలకొన్నా, అనుకోని సంఘటనలు చోటు చేసుకున్నా, వర్షాలు పడినా.. లెక్క చేయకుండా పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. సాయంత్రం 5 గంటల వరకు ఏపీలో 67.99 శాతం పోలింగ్ నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4.13 కోట్లకు పైగా ఓటర్లు ఉండగా.. 2 కోట్ల 71 లక్షలకు పైగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో 1.30 కోట్లకు పైగా పురుషులు ఉండగా, 1.40 కోట్లకు పైగా మహిళలు ఉన్నట్లు తేలింది. పురుషులతో పోలిస్తే.. మహిళలే ఈ పోలింగ్‌లో ఎక్కువగా పాల్గొన్నారు.

# ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ఊపిరి : భారత సుదర్శన్

## - సామాజిక, రాజకీయ ఉద్యమ నేత

## మల్కాజిగిరి ఎం.పి.అభ్యర్థి భారత సుదర్శన్

హైదరాబాద్ మే 13 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): ప్రజాస్వామ్యంలోనే ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో ఉంటారని, ఎన్నికలు మన ప్రజాస్వామ్యానికి ఊపిరిలాంటివని సామాజిక, రాజకీయ ఉద్యమ నేత మల్కాజిగిరి పార్లమెంట్ ఎం.పి.అభ్యర్థి భారత సుదర్శన్ అన్నారు. ఉప్పల్ లోని ఎంపిపి పాఠశాలలో ఆయన తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల్లో పోటీ చేయడమనేది కూడా ప్రజా సమస్యల పరిష్కార ఉద్యమంలో భాగమేనన్నారు. ఎన్నికలు, ఓట్లు వేయడం ప్రజలుగా మనకు అత్యంత ముఖ్యమైనవని భారత సుదర్శన్ అన్నారు. సామాన్యులు చట్టసభల్లోకి ఎన్నికైనపుడే మన భారత ప్రజాస్వామ్యం ఎంతో బలంగా తయారవుతు ందన్నారు. ఈ ఎన్నికల్లో తాను పోటీ చేయడం ద్వారా రాజ్యాధికారంలో సామాన్యులకు భాగస్వామ్యం ఉండాలనే అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికై భవిష్యత్తులోనూ వేర్వేరు రూపాల్లో నిర్మాణాత్మకంగా పని చేస్తానని భారత సుదర్శన్ స్పష్టం చేశారు.

# 106 ఇంటిగ్రేటెడ్ ఆఫీసర్ ట్రైనీస్ కోర్స్ (ఏూఅ) ఆన్‌బోర్డ్ ఫస్ట్ ట్రైనింగ్ స్క్వాడ్రన్ (1TS ) సముద్ర శిక్షణ

న్యూఢిల్లీ, మే 13కఠినమైన సముద్ర శిక్షణను పూర్తి చేసిన తర్వాత, 09 మే 24న 106 ఇంటిగ్రేటెడ్ ఆఫీసర్ ట్రైనీస్ కోర్సు (1TS)కోసం ఒక వాలెడిక్టరీ డిన్నర్‌ని మొదటి శిక్షణా స్క్వాడ్రన్ (1TS)లో నిర్వహించారు. ఎంటఎ ఎ శ్రీనివాస్, ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్- చీఫ్, సదరన్ నేవల్ కమాండ్ కార్యక్రమానికి ముఖ్య అతిథి. అంతర్జాతీయ ట్రైనీలతో సహా 99 మంది సముద్ర శిక్షణార్థులు 1TS పోర్టల్‌ల నుండి విజయవంతంగా శిక్షణను పూర్తి చేశారు. FOC-in-C సౌత్ శిక్షణా దశను విజయవంతంగా పూర్తి చేసినందుకు ట్రైనీలను అభినందించింది మరియు ప్రతిభ కనబరిచిన ట్రైనీలకు ట్రోఫీలను ప్రదానం చేసింది.

బెస్ట్ ఆల్ రౌండ్ సీ ట్రైనీకి టెలిస్కోప్ మిడ్‌షిప్‌మ్యాన్ సి ప్రణీత్‌కు లభించింది మరియు మొత్తం ఆర్డర్ ఆఫ్ మెరిట్‌లో మొదటి స్థానంలో నిలిచినందుకు మిడ్‌షిప్‌మ్యాన్ పిపికె రెడ్డి బైనాక్యులర్‌ను అందుకున్నారు.

శిక్షణార్థులను ఉద్దేశించి ముఖ్య అతిథి మాట్లాడుతూ, ఎప్పటికప్పుడు మారుతున్న యుద్ధ తంత్రాలు, వ్యూహాలు, సాంకేతికత మరియు వ్యూహాల గతిశీలతను తెలుసుకుంటూ జ్ఞానాన్ని పొందేందుకు మరియు సముద్ర వాతావరణాన్ని అర్థం చేసుకునేందుకు కృషి చేయాలని వారిని ఉద్బోధించారు. వేగం, భద్రత మరియు ధైర్యాన్ని కొనసాగిస్తూ పురుషుల పట్ల తీవ్ర వృత్తి నైపుణ్యం మరియు సానుభూతితో వ్యవహరించాల్సిన సైనిక నాయకుడి లక్షణాలను అతను హైలైట్ చేశాడు. 'సేవా పరమో ధర్మం' లేదా 'సేవ బిఫోర్ సెల్ఫ్' అనేది ఎప్పుడూ నినాదంగా ఉండాలి.

11 మే 24న INS తిర్‌లో ఒక విభాగాలు నిర్వహించబడ్డాయి, దీనిని సదరన్ నావల్ కమాండ్ CSO(TRG) రియర్ అడ్మిరల్ సతీష్ షెనాయ్ సమీక్షించారు. అధికారులు ఇప్పుడు వివిధ ఫ్రంట్‌లైన్ నౌకాదళ యుద్ధనౌకలు మరియు పశ్చిమ మరియు తూర్పు సముద్ర తీరంలో సముద్రతీరానికి సంబంధించిన శిక్షణను ఏకీకృతం చేయడం కోసం కోస్ట్ గార్డ్ పెట్రోలింగ్ నౌకల్లో చేరనున్నారు. మారిషస్ కోస్ట్ గార్డ్ నుండి అసిస్ట్ కమెడిట్ ప్రిషితా జగ్గమా 1ూ నుండి సముద్ర శిక్షణను పూర్తి చేసిన మొదటి మహిళా ట్రైనీ అయ్యారు.

# ఏపీలోని తంగెడ గ్రామంలో బాంబుల దాడులు.. పరిస్థితి ఉద్రిక్తం



అమరావతి, మే 13 : పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం మారుమూల ప్రాంతంలో ఉండే తంగెడ గ్రామంలో బాంబుల దాడుల తో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది . వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఒక్క ఓటు విషయంలో జరిగిన వివాదం ఉదయం నుంచి స్వల్ప ఉద్రిక్తలకు దారితీసింది. సాయంత్రం పోలింగ్ 6 గంటలకు ముగిసిన తరువాత గ్రామంలో రెండు వర్గాలు పెట్రోలు, నాటు బాంబులతో ఇళ్లపై దాడి చేసుకున్నారు. దీంతో పలు నివాసపు ఇండ్లు,వాహనాలు దగ్ధమయ్యాయి. ఈ దాడులో 10 మందికి పైగా తీవ్రగాయాలయినట్లు సమాచారం . ఘటనా విషయం తెలుసుకున్న పోలీసులు అదనపు బలగాలతో గ్రామానికి చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మాచర్ల, గురజాల నియోజకవర్గంలో ఉదయం నుంచే ఘర్షణలు జరిగాయి.

# ఇండియన్ నావల్ షిప్ కిల్తాన్ ద్వారా కామ్ రాన్ బే, వియత్నాం సందర్శించండి



న్యూఢిల్లీ, మే 13: INS కిల్తాన్ 12 మే 24న వియత్నాంలోని కామ్ రాన్ బే వద్దకు చేరుకుంది మరియు వియత్నాం పీపుల్స్ నేవీ మరియు ఇండియన్ ఎంబసీ ద్వారా ఘన స్వాగతం లభించింది. ఈ పర్యటన భారత నౌకాదళ తూర్పు నౌకాదళం యొక్క కార్యాచరణ విస్తరణలో భాగం. ఈ పర్యటన రెండు సముద్ర దేశాల మధ్య సుదీర్ఘ స్నేహం మరియు సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి సిద్ధంగా ఉంది.

భారతదేశం మరియు వియత్నాం సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పంచుకుంటున్నాయి. సంబంధాలను మరింతగా పెంపొందిస్తూ, ఇండియన్ నేవల్ షిప్ కిల్తాన్ సందర్శన వృత్తిపరమైన పరస్పర చర్యలు, క్రీడలు, సామాజిక మార్పిడి మరియు కమ్యూనిటీ ఔట్రీచ్ వంటి కార్యకలాపాలపై దృష్టి సారించింది. భారత నౌకాదళం మరియు వియత్నాం పీపుల్స్ నేవీ మధ్య సముద్రంలో సాగే సముద్ర భాగస్వామ్య వ్యాయామంతో పర్యటన ముగుస్తుంది. ఈ వ్యాయామం ఇంటర్‌ఆపరేబిలిటీ మరియు ఉత్తమ అభ్యాసాల మార్పిడిని మరింత మెరుగుపరుస్తుంది. INS కిల్తాన్ అనేది స్వదేశీ INS కార్వెట్, దీనిని ఇండియన్ నేవీ డైరెక్టరేట్ ఆఫ్ నేవల్ డిజైన్ రూపొందించింది మరియు దీనిని కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ నిర్మించారు. ఎఔ కిల్తాన్ నాలుగు ఖ28 యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ కార్వెట్‌లలో మూడవది.

# మహిళ కిడ్నాప్ కేసులో.. జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణకు బెయిల్

బెంగళూరు, మే 13 :: కర్ణాటకకు చెందిన జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణకు (ఊఆ ఖీవలజీనినిజీ) సోమవారం బెయిల్ లభించింది. ఆయన కుమారుడు, హసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు ప్రమేయం ఉన్న లైంగిక వేధింపుల బాధితురాలి కిడ్నాప్ కేసులో బెంగళూరు కోర్టు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. రూ.5 లక్షల బాండ్, అంతే మొత్తానికి రెండు షూరిటీలు సమర్పించాలని హెచ్‌డీ రేవణ్ణను కోర్టు ఆదేశించింది. అలాగే సిట్ దర్యాప్తునకు సహకరించాలని, ఆధారాల దుర్వినియోగానికి పాల్పడ వద్దని కోర్టు పేర్కొంది.

కాగా, మహిళ కిడ్నాప్‌పై ఆమె కుమారుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) హెచ్‌డీ రేవణ్ణను ఈ నెల 4న అరెస్ట్ చేసింది. జేడీఎస్ అధినేత, మాజీ ప్రధాని, తండ్రి హెచ్‌డీ దేవెగౌడ నివాసం నుంచి ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత కోర్టులో ప్రవేశపెట్టగా మూడు రోజులు సిట్ కస్టడీకి అప్పగించింది. అనంతరం ఈ నెల 14 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో జైలుకు తరలించారు. అయితే ఆ గడువుకు ఒక రోజు ముందే హెచ్‌డీ రేవణ్ణకు బెయిల్ లభించింది.

# ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే సెక్యులర్ వాదులకు ఓటెయ్యండి

-రాజ్యాంగ వ్యతిరేక శక్తులను చిత్తుగా ఓడించండి

-ఓటు వేయడం మన బాధ్యత.. ఓటు వేయండి ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటండి

-ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ పిలుపు

కరీంనగర్, మే 13 : (నేటినిజం ప్రతినిధి) ప్రస్తుత విపత్కర పరిస్థితిల్లో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే సెక్యులర్ వాదులకు ఓటు వేసి గెలిపించాలని, ప్రజాస్వామ్యాన్ని



పాతరేయ్యాలని చూస్తున్న సంఘ్ పరివార్ తో సంబంధం ఉన్న రాజ్యాంగ వ్యతిరేక శక్తులను చిత్తుగా ఓడించాలని ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ కరీంనగర్ పార్లమెంటు ప్రజలకు పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని నగరం లోని భారత్ టాకీస్ ప్రాంతంలోని నారాయణ స్కూల్లో 138వ బూత్ లో తన ఓటు హక్కును, కుటుంబ సభ్యులతో సహా వినియోగిం చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు అందరి బాధ్యత అని ఓటు వేయడం మరువ ద్దన్నారు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిం చేందుకు ఓటు అనే ఆయుధంతో తమ పాలకులను ఎన్నుకోవడానికి రాజ్యాంగం కల్పించిన టువంటి హక్కే ఓటు అని ఓటు హక్కును అందరూ ఒక రోజు ఎండ అని చూడకుండా ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిలువుటద్దంగా మారాలని పిలుపునిచ్చారు. గడచిన పది సంవత్స రాలలో సంఘపరి వారతో సంబంధం ఉన్న బిజెపి పార్టీ, ప్రజాస్వామ్య స్ఫూర్తిని, దేశ ప్రజల హక్కులను, కాలరాసే విధంగా ప్రవర్తిస్తోందని ఆరోపించారు. దేశంలో దళితులకు, ముస్లింలకు, బడుగు బలహీన వర్గాలకు భద్రత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. తిండే తిండి పై, తొడుక్కునే దుస్తులపై ఆంక్షలు విధించిన విషయం దేశ ప్రజలందరూ గుర్తుంచుకోవాలని కోరారు. కరోనా లాక్ డౌన్ లో, నోట్ల రద్దు అంశంలో మోడీ ప్రభుత్వం, దేశ ప్రజలపై అవలంబించిన, దమన నీతిని గుర్తు ఉంచుకోవాలని, దేశంలో జీఎస్టీ, విధించడంతో కరోనా లాక్ డౌన్ సమయంలో 80 వేల చిన్న, మధ్యతరహా కుటీర పరిశ్రమలు మూతపడ్డాయని విమర్శించారు. దేశంలో హిందూ ముస్లింల మధ్య వైశ్యాలను పెంచుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దిగజారి మాట్లాడుతుండటం చూస్తుంటే, ఎంత ప్రమాదకరమైనటువంటి పరిస్థితికి దిగజార్చారో అర్థం చేసుకోవచ్చున్నారు. ఇకనైనా దేశ ప్రజలు అర్థం చేసుకొని బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలంటే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే సెక్యులర్ పార్టీలకు, ఓటు వేసి గెలిపించాలని కోరారు. లేకుంటే దేశం అధోగతి పాలవుతుందని భవిష్య తరాలకు మరొకసారి మోడీ గెలిస్తే తినడానికి తిండి, కట్టుకోవడానికి దుస్తులు, ఉండడానికి ఇల్లు, విద్య, వైద్యం అన్ని వసతులు ఉండవని దీనిని ఆలోచించి కరీంనగర్ పార్లమెంట్ ప్రజలు బిజెపికి వ్యతిరేకంగా ఓటేయాలని కోరారు.

# డైరెక్టర్ జనరల్ డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ లెఫ్టినెంట్ జనరల్ డిఎస్ రానా టాంజానియాలో అధికారిక పర్యటన

న్యూఢిల్లీ, మే 13డైరెక్టర్ జనరల్ డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ లెఫ్టినెంట్ జనరల్ డిఎస్ రాణా యునైటెడ్ రిపబ్లిక్ ఆఫ్ టాంజానియాకు అధికారిక పర్యటనకు వెళ్లారు. 13-15 మే 2024 వరకు షెడ్యూల్ చేయబడిన ఈ పర్యటన లక్ష్యం, రెండు దేశాల మధ్య దృఢమైన రక్షణ సంబంధాలను మరింత బలోపేతం చేయడం మరియు ప్రాంతీయ భద్రతా సహకారం కోసం అవకాశాలను చర్చించడం.

తన పర్యటనలో, DG DIA టాంజానియా పీపుల్స్ డిఫెన్స్ ఫోర్స్ యొక్క చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ జాకబ్ జాన్ మ్కుండా మరియు అతని కౌంటర్ మేజర్ జనరల్ MN Mkeremy, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఇంటెలిజెన్స్‌తో సహా టాంజానియా యొక్క సీనియర్ సైనిక నాయకత్వంతో సంభాషించవలసి ఉంది. టాంజానియా నేషనల్ డిఫెన్స్ కాలేజీకి తన పర్యటనలో, అతను TPDF యొక్క భవిష్యత్తు నాయకులతో భారతదేశ భద్రతా దృక్పథం గురించి చర్చిస్తారు. ఈ సమావేశాలు పరస్పర అవగాహన పెంపొందించుకోవడం మరియు ద్వైపాక్షిక రక్షణ సహకారాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా ఉంటాయి.

లెఫ్టినెంట్ జనరల్ డిఎస్ రాణా భారత హైకమిషన్ దార్ ఎస్ సలామ్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన డిఫెన్స్ వింగ్‌ను కూడా ప్రారంభిస్తారు. సైనిక సహకారాన్ని విస్తరింపజేయడానికి సుహృద్భావ సూచనగా, అతను TPDFకు భారతదేశంలో తయారు చేసిన బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లను అందజేస్తాడు. కమాండ్ అండ్ స్టాఫ్ కాలేజ్ అూఅ అరుష వద్ద DG DIA లైబ్రరీని ప్రారంభిస్తారు మరియు భారత ప్రభుత్వ సహాయం ద్వారా సులభతరం చేయబడుతున్న వ్యాయామశాలకు శంకుస్థాపన చేస్తారు.

భారతదేశం టాంజానియాతో సన్నిహిత, వెచ్చని మరియు స్నేహపూర్వక సంబంధాలను పంచుకుంటుంది, ఇది బలమైన సామర్థ్యం పెంపుదల మరియు రక్షణ సహకారానికి మార్గాల ద్వారా బలోపేతం చేయబడింది. భారత సైనిక ప్రతినిధి బృందం పర్యటన టాంజానియాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు.

# ఓటు హక్కును వినియోగించుకున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు



రాజన్న సిరిసిల్ల, 13 :(నేటినిజం ప్రతినిధి): వేములవాడ నియోజకవర్గంలో సోమవారం జరిగిన కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా వేములవాడ నియోజకవర్గం కోనరావుపేట మండలంలోని మర్తన్ పేటలో బి ఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జీ చల్మెడ లక్ష్మీనరసింహారావు వారి సతీమణి సునీల పార్ల మెంట్ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు.ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని అన్నారు. వారి వెంట బి ఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్



రాజన్న సిరిసిల్ల, 13 :(నేటినిజం ప్రతినిధి): జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కుటుంబ సభ్యులతో కలిసి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శాంతినగర్ లో గల 159 పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కును సోమవారం వినియోగించుకున్నారు.

# కుటుంబ సమేతంగా.... ఓటేసిన బండి సంజయ్

-అత్యధిక శాతం ఓటింగ్ తో ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడండి



కరీంనగర్, మే 13 : (నేటినిజం ప్రతినిధి) బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ సోమవారం ఉదయం ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటలకే కరీంనగర్ లోని మహాశక్తి ఆలయానికి సతీసమేతంగా విచ్చేసిన బండి సంజయ్ అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడి నుండి నేరుగా ఇంటికి వచ్చిన బండి సంజయ్ హంపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం బండి సంజయ్ తన తల్లి వేలు పట్టుకుని కుటుంబ సమేతంగా జ్యోతినగర్ లోని 174వ పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ "దేశ భద్రతకు, అభివృద్ధికి, ధర్మ రక్షణ కోసం జరిగే ఎన్నికలివి. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, తప్పుడు ప్రచారాలు నమ్మకుండా ప్రతి ఒక్కరూ ఓటేయడంతోపాటు మీ చుట్టు పక్కల ఉన్న వారందరితో ఓటేయించి ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడాలని కోరుతున్నా. వార్ వన్ సైడే ఉంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు అధికారం, డబ్బు, మనీని ఉపయోగించి ప్రలోభాలకు గురి చేస్తున్నారు. బీజేపీ కార్యకర్తలంతా వాటిని అడ్డుకోవాలి. ప్రజాస్వామ్యయుతంగా, ప్రశాతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చేయండి. నూటికి నూరుశాతం పోలింగ్ జరిగేలా క్రుషి చేసిన వారందరినీ స్వయంగా సన్మానిస్తా." అని తెలిపారు.

# ఓటు వినియోగించుకున్న ఈటల రాజేందర్



హైదరాబాద్, మే 13 :మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌పూడూర్ లో కుటుంబ సమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగించుకోవడం పవిత్ర ఘట్టంగా అభివర్ణించారు. ఎన్నికల్లో నోట్లు, మద్యంతో ప్రలోభపెట్టడం మంచి కాదన్నారు.

ఈటల రాజేందర్ గత అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్, గజ్వేల్ నుంచి పోటీ చేశారు. అయితే రెండు స్థానాల్లో కూడా ఆయన ఓటమి పాలయ్యారు. హుజూరాబాద్ లో పాడి కౌశిక్ రెడ్డి విజయం సాధించగా.. గజ్వేల్ లో కేసీఆర్ గెలుపొందారు. దీంతో ఆయన లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఈటల స్థానికంగా కరీంనగర్ నియోజకవర్గానికి చెందినవారు. అయితే అక్కడ బండి సంజయ్ ఉండడంతో ఈటల రాజేందరు మల్కాజిగిరికి రావాల్సి వచ్చింది. ప్రచారంలో ఈటల కష్టపడ్డారు. ఆయన ఎంపీగా గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీ 17 స్థానాల్లో పోటీ చేస్తోంది.

# రక్షణ మంత్రిని తొలగించిన పుతిన్

మాస్కో, మే 13 : కొన్ని రోజుల క్రితం అయిదోసారి రష్యా దేశాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన వ్లాదిమిర్ పుతిన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రక్షణ మంత్రి సెర్గీ షోయిగును ఆ పదవి నుంచి తొలగించారు. 68 ఏళ్ల షోయిగు 2012 నుంచి రక్షణ మంత్రిగా చేశారు. అయితే ప్రస్తుతం ఆయన్ను రష్యా సెక్యూర్టీ కౌన్సిల్ సెక్రటరీగా నియమించనున్నారు. షోయిగు స్థానంలో డిప్యూటీ ప్రధాని ఆండ్రే బెలసోవ్‌ను రక్షణ మంత్రిగా నియమిస్తున్న రష్యా పార్లమెంట్ పేర్కొన్నది. రక్షణ మంత్రి ఇన్నోవేటివ్‌గా ఉండాలని క్రెమ్లిన్ అభిప్రాయపడింది. శక్తివంతమైన సెక్యూర్టీ కౌన్సిల్ కీలక పదవిలో నిఖోలోయ్ పత్రుసేవ్ ఉన్నారు. అయితే ఆయన్ను ఆ స్థానం నుంచి తొలగించిన షోయిగును నియమించాలని పుతిన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. పత్రుసేవ్‌కు ఏ పదవి ఇస్తారో ఇంకా స్పష్టంగా తెలియదు.

రక్షణ మంత్రి షోయిగు, పుతిన్ ఒకప్పుడు సైబీరియాలో ఫిషింగ్‌కు వెళ్లేవాళ్లు. అయితే ఎటువంటి మిలిటరీ బ్యాక్‌గ్రౌండ్ లేని షోయిగుకు రక్షణ మంత్రి బాధ్యతలను అప్పగించారు. ప్రొఫెషనల్‌గా ఆయన సివిల్ ఇంజినీర్. 1990 దశకంలో ఆయన ఎమర్జెన్సీ, డిజాస్టర్ శాఖ మంత్రిగా చేశారు. ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలైన తర్వాత రక్షణ మంత్రిగా షోయిగు పూర్తి స్థాయిలో బాధ్యతల్ని నిర్వర్తించారు.

# ఓటు హక్కును వినియోగించుకున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి..

-ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి..

-బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి..



కరీంనగర్, మే 13 : (నేటినిజం ప్రతినిధి) 0బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతోకలిసి హుజురాబాద్ లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడాలని కోరారు. ఎన్నికలు దేశం కోసం, ధర్మం కోసం జరుగుతున్న ఎన్నికలన్నారు. కాంగ్రెస్, టిఆర్ఎస్ లు ఎన్ని ప్రలోభాల కు గురిచేసినా, తప్పుడు ప్రచారాలు చేసిన నమ్మద్దని , ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకొని, చుట్టుపక్కల వారితో కూడా వేయించాలన్నారు. ఇందుకోసం బిజెపి పోలింగ్ బూత్ శ్రేణులు అందరూ తగిన కృషి చేయాలన్నారు.

# పదేండ్ల తర్వాత దేశంలో మార్పు రాబోతుంది- మంత్రి రాజనర్సింహ



మెదక్, మే 13 : మారుతున్న రాజకీయ పరిణామాల్లో ప్రజల్లో వస్తున్న చైతన్యంతో దేశంలో మార్పు రాబోతుందని, పదేళ్ల తర్వాత అధికారంలోకి ఇండియా కూటమి ఏర్పాటు కాబోతుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా సోమవారం జోగిపేట మున్సిపల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలోని ఏర్పాటు చేసిన 196 పోలింగ్ బూత్ లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంపూర్ణ విశ్వాసం నమ్మకం తనకు ఉందని, జరుగుతున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజార్టీ స్థానాలు సాధించబోతుందని, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ కు 12 నుంచి 14 ఎంపి స్థానాలు రాబోతున్నట్లు మంత్రి తెలిపారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కర్ కు మంచి మెజార్టీ వస్తుందని తెలిపారు.

అందోల్ నియోజకవర్గంలో కూడా కాంగ్రెస్ అత్యధిక మెజార్టీ రాబోతుందన్నారు.

మంత్రి దామోదర్ తో పాటు ఆయన కూతురు త్రిష కూడా ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, సీనియర్ పార్టీ నాయకులు జగన్మోహన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రవీణ్ కుమార్ మున్సిపల్ కౌన్సిలర్లు సురేందర్ గౌడ్, ఆకుల చిట్టిబాబు, డాకూరి శివశంకర్, కోరబోయిన నాగరాజు, దుర్గేష్, చందర్ నాయక్, పార్టీ నాయకులు పట్టోళ్ల ప్రవీణ్, గుర్రం కృష్ణ, సత్యం, మధు తదితరులు ఉన్నారు.

# ఇడుపులపాయలో ఓటు హక్కును వినియోగించుకున్న వైఎస్ షర్మిల

అమరావతి, మే 13 : ఏపీలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల దంపతులు సోమవారం ఓటు హక్కును వినియోగించుకున్నారు. కడప పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న షర్మిల , భర్త అనిల్‌తో కలిసి ఇడుపులపాయలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ నాయకులు దౌర్జన్యాలకు, దాడులకు పాల్పడుతూ ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

రైల్వేకోడూరులో వైసీపీ అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలని ఈసీని కోరారు. అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అధికారులు, పోలీసులు నిస్వార్థంగా పనిచేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలసిన బాధ్యత ఉందని కోరారు.

# ఓటేసిన రాంచరణ్-ఉపాసన.. ట్రెండింగ్‌లో విజువల్స్

హైదరాబాద్, మే 13 :లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. సాధారణ ప్రజలతోపాటు సెలబ్రిటీలు, రాజకీయ ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. టాలీవుడ్ స్టార్ యాక్టర్ రాంచరణ్ ఉపాసన దంపతులు జూబ్లీహిల్స్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన బూత్‌లో ఓటు వేశారు. అనంతరం రాంచరణ్-ఉపాసన సిరా గుర్తు చూపిస్తూ.. అందరూ ఓటు తమ హక్కు వినియోగించుకోవాలని కోరారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియో నెట్టింట వైరల్ అవుతున్నాయి.

జూబ్లీహిల్స్‌లో మెగాస్టార్ చిరంజీవి దంపతులు, మహేశ్ బాబు, నరేశ్, రాజేంద్రప్రసాద్, సీనియర్ నటుడు కోట శ్రీనివాసరావు నందమూరి కల్యాణ్ రామ్, సందీప్ కిషన్, ఆదిసాయికుమార్, అనన్యనాగళ్ల, అల్లు శిరీష్, కిరణ్ అబ్బరవరం, మంచు మోహన్ బాబు, మనోజ్, విష్ణు, అక్కినేని నాగచైతన్యతోపాటు పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిసిందే.

# ఆస్కీతో టీహబ్ భాగస్వామ్యం

హైదరాబాద్, మే 13 : అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా తో టీ హబ్‌జత కట్టింది. ప్రారంభించిన వ్యాపార కార్యకలాపాలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన నైపుణ్యాలను స్టార్టప్ వ్యవస్థాపకులకు బోధించేందుకు 'ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మేనేజ్‌మెంట్' పేరుతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది.

సాంప్రదాయ వ్యాపార సంస్థల నిర్వహణ విధానాల స్థానంలో కొత్తగా అవలంభించాల్సిన పద్ధతులపై ఔత్సాహిక వ్యాపార వేత్తలకు శిక్షణ ఉంటుందని టీ హబ్ సీఈఓ ఎం.ఎస్.రావు తెలిపారు. ఇందులో మాస్టర్ ఫైనాన్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్, స్ట్రాటజీ, ఎనలిటిక్స్ వంటి అంశాల్లో ఆస్కికి చెందిన నిపుణులతో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు టీ హబ్‌ను సంప్రదించాలని సూచించారు.

# ముంబైలో దుమ్ము తుఫాన్.. నగరాన్ని తాకిన తొలి చినుకు

ముంబై, మే 13 : ముంబైలో ఇవాళ మధ్యాహ్నం భారీ ఎత్తున దుమ్ము తుఫాన్ వచ్చింది. దీంతో ఆకాశం నల్లగా మారిపోయింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో.. ముంబైలో దుమ్ము విపరీతంగా లేచింది. వెదర్‌లో ఆకస్మికంగా వచ్చిన మార్పులతో.. నగరంలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. కొన్ని ప్రాంతాల్లో బలమైన గాలులు వీచాయి. కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఘాట్‌కోపర్, బంద్రా కుర్లా, ధారావి ప్రాంతాల్లో వాతావరణం భీకరంగా మారింది. పాల్గర్, థానే ప్రాంతాల్లో మెరుపులు, ఉరుములతో కూడిన వర్షం పడింది. ఆ ప్రాంతంలో గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. కొన్ని ప్రాంతాల్లో భీకర గాలుల వల్ల చెట్లు నేలకూలాయి. ఆరోలి సెక్టర్ 5 ఏరియాలో ఉన్న రోడ్డుపై ఓ భారీ వృక్షం పడిపోయింది. దీని వల్ల అక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.